
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
అన్నమయ్య
శనివారం | 26 ఏప్రిల్ 2025
పేజీలు 8








# అక్కడ రిజిస్ట్రేషన్ ఇక్కడ కబ్జా...

- మాయగాడి దెబ్బకు అధికారులు అవాక్కు..
- మండలం దోచుకునేందుకు సర్వం సిద్ధం...
- ఆటలో అరటి పండుకు నియోజకవర్గ నాయకుల మద్దతు
- టిడిపి సంస్థాగత పదవుల్లోనూ జోక్యం...
- ఇంతకీ ఇతను ప్రభుత్వ ఉద్యోగా లేక రాజకీయ నాయకుడా

**అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి అనే సినిమా టైటిల్ లాగా పుల్లంపేట మండల కేంద్రంలో కొందరు మాయగాళ్లు తమ క్రిమినల్ మైండ్‌తో అక్కడ నెంబర్ తో రిజిస్ట్రేషన్ చేసుకొని ఇక్కడ గ్రామ కంఠం దోచుకునేందుకు సిద్ధం అయ్యి అధికారులను కూడా నేను పుల్లంపేటకు ఎమ్మెల్యేకు సమానం అంటూ బెదిరిస్తున్నారు.అయితే అతని కథ చూస్తే మాత్రం పుల్లంపేట రాజకీయాలలో ఆటలో అరటి పండు అంటూ చమత్కరిస్తున్నారు.**

**అన్నమయ్య జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్:** అన్ని పాములు లేచి ఆడితే ఏలిక పాము కూడా లేసి బుస కొట్టింది అన్నట్లు ఉంది పుల్లంపేట మండలంలో ఒక ఆటలో అరటి పండు నాయకుని వ్యవహారం.నియోజకవర్గ నాయకులు టీడీపీకి ఎప్పటి నుండో పనిచేస్తున్న నాయకులను కాదని, తమకు నమ్మకస్తుడు ఉంటూ ప్రభుత్వ ఉద్యోగానికి సెలవు పెట్టీ మరి సేవలు చేస్తున్న ఒక రాష్ట్ర స్థాయిలో ఎదగవలసిన ఒక మహా నాయకుడిని నమ్మి పుల్లంపేట మండలంలో పెత్తనం కట్టబెడితే ఉన్నది పోయేలా ఉంచుకున్నది పోయేలా టిడిపి పరిస్థితి తయారయ్యింది. తెలుగు తమ్ముళ్లే బహిరంగంగా విమర్శలు గుప్పిస్తున్నారు. నియోజవర్గ నాయకులు అండదండలతో నాయకుడిగా చలామణి అవుతున్న ఈ ప్రభుత్వ ఉద్యోగి చేసిన ఒక మాయ అధికారులని ఆశ్చర్యపరిచింది. అది ఎలా అంటే తమ ఇంటి పక్కన ఉన్న ప్రభుత్వ గ్రామ కంఠన్ని స్వాహా చేసేందుకు 8 ఏళ్ల క్రితం చేసిన ప్రయత్నం ఇటీవల అధికారం అడ్డం పెట్టుకొని చదును చేయడంతో బయటపడడం, మిగతా 2లో

# పుల్లంపేట ఉపాధి హామీ పనుల్లో గోల్‌మాల్

- 20 లక్షల ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం
- అనంతంపల్లి, జాగువారిపల్లి గ్రామాలలో త్రాగునీటి, విద్యుత్ లైట్ ల కోసం సొంత నిధులు అయినా ఖర్చు పెడతా
- ఆ రెండు గ్రామాల ప్రజలను ఇబ్బంది పెట్టవద్దు
- మండల వ్యాప్తంగా మొత్తం 176 బెల్ట్ షాపులు
- మండల సర్వసభ్య సమావేశంలో మండలాధ్యక్షుడు ముద్దా వెంకట సుబ్బారెడ్డి



**పుల్లంపేట, మేజర్ న్యూస్:** పుల్లంపేట మండలం వత్తలూరు ఉపాధి హామీ పనుల్లో అంతా అవినీతి జరుగుతుందని మండల అధ్యక్షుడు ముద్దా వెంకటసుబ్బారెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం మండల పరిషత్ సభా భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులపై మాట్లాడుతూ పుల్లంపేట మండలంలో మొత్తం 22 పంచాయితీలుగాను 3290 మంది ఉపాధి హామీ కూలీలు ఉండగా ఒక్క వత్తలూరు పంచాయతీలోని 1000 మంది ఉపాధి కూలీలు ఉన్నారని ఇక అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం అవుతోందని అన్నారు. తిప్పాయపల్లెలో ఒక క్రిమినల్‌ని పెట్టుకొని అతను కోర్టుకు హాజరైన రోజుకూడా పనికి వేతనం చెల్లించారని ఇది ఎంతో దారుణమని అన్నారు. కోర్టుకు హాజరైన క్రిమినల్కు ఆరోజు వేతనం చెల్లించలేదు అని నిరూపిస్తే నా ఆస్తిలో 50 శాతం రాసి స్తానని మండల సమావేశంలో ఎంపీపీ శబదం చేశారు. ఉపాధి పనిలో లక్షలాది రూపాయలు దోచుకోమని మీకు సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారా, స్థానిక ఎమ్మెల్యే చెప్పారా అంటూ ఏపీవోను నిలదీశారు. అనంత సముద్రము, వత్తలూరు పంచాయతీలలో ఒకే ఫోటో పెట్టి వివిధ రకాల పేర్లతో నమోదు చేశారని అన్నారు.పుల్లంపేట పంచాయతీకి చెందిన వ్యక్తికి రామసముద్రం పంచాయతీలో పనిలో పెట్టి 28 వేల రూపాయలు అతను తీసుకున్నాడని, మూరముట్ల పల్లె వారి ఫోటో పెట్టి ఈడిగ పల్లె లోని ముస్లింలు, కల్లు గీత కార్మికుల వారి పేర్లు నమోదు చేశారని, అదే విధంగా మళ్ళెంవారి పల్లె వాళ్ళు ఫోటో పెట్టి తిరుమలయ్య గారి పల్లె వారి పేర్లు నమోదు చేశారని అన్నారు .సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తులు, మహిళలను కూడా ఉపాధి హామీ కూలీలుగా నమోదు చేయించి సుమారు 20 లక్షల రూపాయలు డబ్బులు స్వాహా చేస్తున్నారన్నారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ లేనప్పుడు సంబంధిత పంచాయతీ సర్పంచి అనుమతి లేకుండానే తన ఇష్ట ప్రకారము తన ఇష్టమొచ్చిన వారిని మేట్లుగా నియమించుకోవడం ఇది ఎంతవరకు సమంజసం ఉన్నారు. ఒక పంచాయతీలోని వెయ్యిమంది మిగతా 2లో

## జమ్మూ-కాశ్మీర్ ఉగ్రవాద దాడి

# హేయమైన చర్య

**-రాయచోటి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బాబా సర్దార్**

రాయచోటి,మేజర్ న్యూస్: జమ్మూ-కాశ్మీర్ లో ని పహల్గామ్ లో మంగళవారం జరిగిన ఉగ్రవాద దాడిని కాంగ్రెస్ పార్టీ రాయచోటి పట్టణ అధ్యక్షుడు బాబా సర్దార్ తీవ్రంగా ఖండించారు. ఈ హేయమైన చర్యకు బాధ్యులైన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని ఆయన అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరులతో మాట్లాడుతూ కాశ్మీర్ లో జరిగిన ఘటనలో ముగ్గురు తెలుగు తమ్ముడు ఉండడం మన దౌర్భాగ్యం, అమాయకు లను చంపేయడం అత్యంత బాధాకరమన్నారు.ఉగ్రవాదం పైకేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని ఈ సందర్భంగా ఆయన కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఆత్మీ యులను కోల్పో యిన వారికి ఆయన సానుభూ తి వ్యక్తం చేశారు.క్షతగాత్రులు, అతి త్వరగా కోలుకోవాలని దేవుని ప్రార్థిస్తున్నా అన్నారు. బాధితులకు వెంటనే నష్ట పరిహారం గా తగిన ఆర్థిక సహాయం అందించాలని, అలాగే భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు మళ్లీ మళ్లీ పునరావృతం కాకుండా వుండాలని కేంద్ర ప్రభుత్వానికి ఆయన కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పటాన్ ఖాదర్ ఖాన్ , షేక్ రియాజ్. పటం ముబారక్ ఖాన్. పటాన్ ఇమ్రాన్ ఖాన్. షేక్ మొహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.



## నవోదయకు ఇద్దరు విద్యార్థులు ఎంపిక



**కలికిరి మేజర్ న్యూస్:** నవోదయకు ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు శాంతినికేతన్ నవోదయ కోచింగ్ సెంటర్ కరస్పాండెంట్ ప్రతాప్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ శివకుమార్ తెలిపారు. 2025–26 నవోదయ విద్యా సంవత్సరానికి గాను శాంతినికేతన్ కోచింగ్ సెంటర్ నుంచి 20 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షలకు హాజరుకాగా వారిలో అనురాగ్ రెడ్డి 97.5 మార్కులు, వెంకట్ గణేష్ 86.25 మార్కులు, మహేంద్ర నాయుడు 83.75, పంచ జన్య రెడ్డి 83.75, సాయి రిషిక 78.75, రిధాన్ 78.75, ధార్మిక్ సృజన్78.75, హర్షిత్ 75, 9వ తరగతి విద్యార్థి చరణ్ జిత్ 74, నిఖిల ప్రియ 73.75, తేజేష్ 72.50 మార్కులు సాధించారు. వీరిలో అనురాగ్ రెడ్డి, చరణ్ జిత్ ఇద్దరు విద్యార్థులు నవోదయ ప్రవేశ పరీక్షలకు ఎంపికైనట్లు వారు తెలిపారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను శాంతినికేతన్ కరస్పాండెంట్ ఎం ప్రతాప్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ శివకుమార్, మరియు అధ్యాపక బృందం వారిని ప్రత్యేకంగా అభినందించారు.

## విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



రైల్వేకోడూరు మేజర్ న్యూస్: రైల్వేకోడూరులో ఈరోజు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కలిసి. మంగళవారం రోజు జరిగినటువంటి ఉగ్ర దాడిని నిరసిస్తూ 28 మంది ప్రాణాలు బలిగొన్న వారి ఆత్మలు శాంతించాలని కోరు కుంటూ పాకిస్తాన్ ఇస్లాం ఉగ్రమూకలు ప్రపంచంలో ఎక్కడున్నా నశించాలని మరియు భారతదేశంలో ఏ ఒక్క ప్రాంతంలోనూ ఉగ్రముఖలను లేకుండా హతం చేయాలని కోరుతూ స్వచ్ఛందంగా భారీ నిరసన కార్యక్రమం చేయడం జరిగింది... ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరు పేరున ధన్యవాదాలు హిందూ బంధువు, హిందువుల ఐక్యత వర్ధిల్లాలి అనే నినాదాలతో బిజెపికి భారతదేశంలో అఖండమైన మెజారిటీని అన్ని రాష్ట్రాల యందు తేవాలని ఆకాంక్షిస్తూ. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోనీ అన్ని సేవా సంఘాలు పాల్గొనడం జరిగినది.



## పహల్గామ్ ఉగ్రవాద దాడులు పిరికి పంద చర్యలి

**-జనసేన పార్టీ రాజంపేట పార్లమెంటు సమన్వయ కర్త అతికారి క్రిష్ణ**




**సిద్ధవటం మేజర్ న్యూస్:** జమ్మూకాశ్మీర్ పహల్గామ్ లో పర్యటకులపై ఉగ్రవాదులు దాడులకు పాల్పడం పిరికిపంద చర్య అని జనసేన పార్టీ రాజంపేట పార్లమెంటు సమన్వయ కర్త అతికారి క్రిష్ణ అన్నారు. జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్ లో బుధవారం జరిగిన దారుణ ఘటనపై దేశమంతా తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. అమాయక యాత్రికులపై తీవ్రవాదులు జరిపిన కాల్పుల్లో 28 మంది ప్రాణాలు కోల్పోవడం తీవ్ర చింతన కలిగిస్తోంది. ఈ దుశ్చర్యను ఖండిస్తూ, సిద్ధవటం మండలం మాధవరం 1 గ్రామపంచాయతీ శుక్రవారం సాయంత్రం జనసేన పార్టీ రాజంపేటపార్లమెంటు సమన్వయ కర్త అతికారి క్రిష్ణ ఆద్వర్యంలో పెద్ద ఎత్తున పాల్గొని కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. మాధవరం-1 గ్రామ పంచాయతీలోని పార్వతీపురం గ్రామం శ్రీ భద్రావతి భావనారాయణ గుడి వద్ద నుండి మాధవరం-1 బస్టాండు వరకు భారీ ర్యాలీ జరిగింది. అ ఈ ర్యాలీలో వందలాదిమంది ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతికారి క్రిష్ణ మాట్లాడుతూ "జమ్ము కాశ్మీర్లో పర్యాటక వృద్ధిని అడ్డుకునేందుకు, భవిష్యత్తులో జరగనున్న అమర్నాథ్ యాత్రను నిలిపివేయాలనే కుట్రపూరిత ప్రయత్నంలో భాగంగా ఈ అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. మృతుల కుటుంబాలకు వారు సంతాపం తెలిపారు. గాయపడిన వారు వేగంగా కోలుకోవాలని అక్షాంక్షించారు. టెర్రరిస్టుల మారణకాండ ఎక్కడా పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో కే ఎస్ నరసింహ, కుప్పాల వెంకటసుబ్బయ్య, పుత్త రామచంద్రయ్య, సర్పంచ్ ప్రతినిధి, ఓబులయ్య, సిద్ధవటం ఉప సర్పంచ్ ఇదాయితుల, కడప రమణయ్య, నరసయ్య, యువ నాయకులు, బాబి, పసుపులేటి గంగయ్య, లక్ష్మీ మన్యం, గంగాధర్, అవ్వరు రవిశంకర్, శ్రీకాంత్, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిద్ధవటం ఎస్సై మహమ్మద్ రఫీ, ఒంటిమిట్ట ఎస్సై, శివప్రసాద్, పోలీస్ సిబ్బంది, గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు, మహిళలు యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## పుల్లంపేటలో ఉపాధి హామీ పనుల్లో గోల్ మాల్

**(మొదటి పేజీ తరువాయి)**ఉపాధి హామీ ఉపాధి కూలీలను నియమించుకోవడం తన ఇష్టారాజ్యంగా వ్యవహరించడం ఇది ఏమన్నా నీసొంత డబ్బా, లేక నీవాటా ఎంత, ఎంతకు లాలూచీ పడినావు, ఎంత వాటా ఇస్తానన్నారు, అని ఏపీఓని నిలదీశారు. గత ఐదు సంవత్సరాల క్రితమే ఈ విషయాన్ని నేను ఎన్నోసార్లు ఏపీ ఓ దృష్టికి తీసుకొచ్చానని అయినా దీని మీద చర్యలు తీసుకోకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన బిడ్డ మీద తన మనవరాలు మీద కూడా ప్రమాణం చేసి చెప్తున్నాను అని నూటికి నూరు శాతం ఉపాధి హామీ పనుల్లో అవినీతి జరుగుతోందని దీనిపై తక్షణం చర్యలు తీసుకుంటా అని ఆయన అన్నారు. ఏపీవో శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలో ఎక్కువ మంది ఉపాధి హామీ కూలీలు ఉన్నందున వారిని గుర్తు పెట్టుకోవడం కష్టమని అందువల్ల పొరపాటు జరిగి ఉంటుందని అన్నారు. కానీ ఒక 20 రోజులు గడువు ఇస్తున్నానని ఈ 20 రోజుల్లో పుల్లంపేటలో మొత్తం ఉపాధి హామీ ప్రక్షాళన చేయాలని క్రిమినల్స్ ను ఏరి వేయాలని నిజమైన అర్హులైన కూలీలకు న్యాయం జరగాలని అనర్హులను, క్రిమినల్స్ ను తొలగించాలని లేకపోతే దీనిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. దీనికి సంబంధించిన మొత్తం అన్ని విషయాలను కలెక్టర్ గారికి, పిడికి ఉపాధి హామీ కమిషన్ కి మండల తీర్మానం చేసి పంపిస్తున్నామని ఆయన అన్నారు. తాసిల్దార్ గత తొమ్మిది నెలల వ్యవధిలో మూడుసార్లు సర్వసభ్య సమావేశాలు నిర్వహించినా తాసిల్దార్ రాకపోవడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే ఆలస్యంగా తాసిల్దార్ మండల సర్వసభ్య సమావేశానికి రావడంతో అనంతసముద్రంలో ముగ్గురు అన్నదమ్ముల భూమిని సర్వే చేసి తనకు భూమి అప్పగించాలని ఎన్నిసార్లు తాసిల్దార్ కి మొరపెట్టుకున్న, ఫోన్ చేసినా స్పందించలేదని తాసిల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతసముద్రంలో 100 సంవత్సరాల చింత చెట్టును పెట్రోల్ పోసి కాల్చివేసిన వారిని చర్యలు తీసుకోలేదని అన్నారు. దీనికి స్పందించిన తాసిల్దార్ వారం రోజుల్లో గా రైతు సమస్యలు పరిష్కరిస్తానని అన్నారు. ఈ ప్రభుత్వ హయాం లో మండలంలో గ్రామ గ్రామాన ఎక్కడ చూసినా విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారని దీనివల్ల ప్రజలు తమ ఇస్తానుసారంగా మద్యం తాగి కొట్టుకొని కొంతమంది ఆస్పత్రి పాలుకాగా నియోజకవర్గంలో ఈ జనవరి నుండి ఇప్పటివరకు 38 మంది చనిపోగా ఒక్క పుల్లంపేట లోనె 12 మంది చనిపోయారని అన్నారు. బెల్టు షాపులు తొలగించకపోతే వచ్చే నెల 15 న 1000 మంది మహిళలతో రాజంపేట ఎక్సైజ్ సీఐ కార్యాలయాన్ని ముట్టడిస్తామని అన్నారు. అదేవిధంగా పుల్లంపేట మండలంలో ప్రస్తుతానికి త్రాగునీటి సమస్య లేదని కానీ ఎక్కడ త్రాగునీటి సమస్య తలెత్తిన వెంటనే సర్పంచ్ దృష్టికి గాని తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని అన్నారు. మండల విద్యాశాఖ అధికారి చక్రధర్రాజు మాట్లాడుతూ పుల్లంపేట మండలంలో పుల్లంపేట, కొత్తపేట, దలవాయిపల్లి, రెడ్డిపల్లి, దాసరిపల్లి, అనంతంపల్లి, ఈడిగపల్లి గ్రామాలలో ప్రభుత్వం 2025-2026 విద్యాసంవత్సరం నుంచి మోడల్ స్కూల్ ప్రవేశపెట్టిందని విద్యార్థులు తల్లిదండ్రులు ఈ యొక్క అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం మండల అధ్యక్షుడు వివిధ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జయశంకర్ నాయుడు, బోగా వెంకటరత్నమ్మ, ఎంపీడీవో వరప్రసాద్, తాసిల్దార్ అరవింద కిషోర్, అన్ని శాఖల మండల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## అక్కడ రిజిస్ట్రేషన్ ఇక్కడ కబ్జా,,,

**(మొదటి పేజీ తరువాయి)**వెళ్లిన అధికారులను ఇది నాకు రిజిస్టర్ అయింది అని వాదనకు దిగడం, నేను తలచుకుంటే అంటూ అధికారు లకు బదిలీలే అని హెచ్చరించడం చకచక జరిగిపోయాయి. అయితే అయ్యగారి హంగామాకి గ్రామ కంఠంపై నేటి దినపత్రిక సూర్యలో వార్త ప్రచురితం కావడంతో అలర్ట్ అయిన ఉన్నతాధికారులు ఈ గ్రామకంఠ స్వాహాపై విచారణ జరపాలని అధికారులు ఆదేశిం చారు. మరి విచారించిన అధికారులకు మాత్రం అక్కడ రిజిస్ట్రేషన్ ఇక్కడ కబ్జా అనే క్యాప్షన్‌తో ఒక సినిమా టైటిల్ని పోలిన అనుభూతి కలిగింది.

**రిజిస్ట్రేషన్ 293లో, కబ్జా 262లో**

గ్రామ కంఠం తమ సొంత జాగీరులా ఊహించుకొని గ్రామకంఠం సర్వేనెంబర్ అనుకొని వేరొక సర్వేనెంబర్ వేసుకొని మాయగాళ్లు కూడా పప్పులో కాలేశారు. గ్రామకంఠం సర్వేనెంబర్ 262 కాగా, మన మహా మేధావులు మాత్రం 293 సర్వే నెంబర్ వేసుకుని రిజిస్టర్ చేయించుకొని, ఎవరికీ తెలియదు అనుకుని గ్రామ కంటాన్ని స్వాహా చేసేందుకు గట్టిగానే ప్రయత్నించారు. మరి దొంగలను పట్టుకునేందుకు పోలీసులు ఉన్నట్లే, ప్రతి అన్యాయం వెనక ఒక న్యాయం ఉంటుందని ఎవరో ఒకరి ద్వారా ఆ అన్యాయం బయటికి వస్తాదనే నానుడిలాగా ప్రస్తుతం ఈ మాయగాల్ల గుట్టురట్టయింది. పాపం సరిగా కబ్జా కూడా చేయలేక తప్పుడు సర్వే నెంబర్లతో గ్రామ కంటాన్ని స్వాహా చేయలేని ఇలాంటి అమాయకులకు మరి పుల్లంపేటలో ఎంతో రాజకీయ చరిత్ర గల నాయకుల మధ్య పెత్తనంచేయమని అవకాశం ఇచ్చిన మరి పెద్ద నాయకులు మరింత అమాయకులో అని పలువురు చమత్కరిస్తున్నారు.

**పార్టీ సంస్థాగత పదవుల్లోనూ పెత్తనం**

ఏనాడు తెలుగుదేశానికి పార్టీకి పనిచేసిన దాఖలాలు లేవు. ఒకవేళ పని చేయాలనుకున్న అతను ఒక ప్రభుత్వ ఉద్యోగి. గత కొన్ని సంవత్సరాలుగా ఉద్యోగానికి సెలవు పెట్టి మరి ఆయన సొంత కార్యక్రమాలు నెరవేర్చుకుంటున్నారు. సెలవు పెట్టినప్పుడు సొంత కార్యక్రమాలు నెరవేర్చుకుంటే పర్లేదు కానీ ఏకంగా రాజకీయ కార్యక్రమాలలో, టిడిపి సంస్థ గత ఎన్నికలలో, నామినేటెడ్ పదవుల్లో కూడా పుల్లంపేట మండలానికి సంబంధించి అతని జోక్యం చేసుకోవడం చూసి అనేకమంది తెలుగు తమ్ముళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరి ఏ అర్హతతో ఇలాంటి వ్యక్తులకు నియోజకవర్గ నాయకులు మద్దతు ఇస్తున్నారో, ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేయకుండా కేవలం సెలవుపై రాజకీయ కార్యక్రమాలు చేస్తుంటే ఫిర్యాదు చేసిన పట్టించుకోని జిల్లా విద్యాశాఖ అధికారులు అతని ఇచ్చేసొమ్ముకు అమ్ముడుపోయారా లేక ఉద్యోగులు సెలవులు పెట్టి రాజకీయాలు చేర్చుకోవచ్చని జీవోలు జారీ చేశారో అర్థం కావడం లేదని పలువురు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. మొత్తానికి ఇన్నేళు గా కష్టపడే తెలుగు తమ్ముళ్లకు మాత్రం పెత్తనం అటు ఉంచితే అసలు ఒక పాఠశాలల్లో టీచర్‌గా పనిచేసేవ్యక్తి కింద పని చేయవలసిన ఖర్మ పట్టిందని, ఇదేమి ఖర్మరా బాబు మాకు అంటూ గతంలో వైసిపి గవర్నమెంట్‌లో కార్యక్రమాలు చేసిన అనేకమంది తెలుగు తమ్ముళ్లు ఇప్పుడు అదే డైలాగుతో తలలు పట్టుకుంటున్నారు.

**గ్రామకంఠంకు వాళ్ళ రిజిస్ట్రేషన్ కు సంబంధం లేదు,,,**

293 సర్వే నెంబర్లు రిజిస్ట్రేషన్ చేసుకుని, అందుకు సంబంధించి లింక్ డాక్యుమెంట్లు ఏమీ లేవని సంబంధిత వ్యక్తులు తెలియజేశారని, ఈ డాక్యుమెంట్లు చూపించి గ్రామ కంఠం సర్వే నెంబర్ 262లో చదువులు చేస్తున్నడం చట్ట విరుద్ధమని, అసలు గ్రామకంటానికి సదరు రిజిస్ట్రేషన్‌కు సంబంధమే లేదని, అది ముమ్మాటికి గ్రామ కంట ప్రభుత్వ భూమిని, ఇదే విషయాన్ని సంబంధిత వ్యక్తులకు కూడా తెలియజేశామని, త్వరలో గ్రామకంఠం వద్ద హెచ్చరిక బోర్డును కూడా ఏర్పాటు చేస్తామని పుల్లంపేట తాహసిల్దార్ అరవింద్ కిషోర్ తెలియజేశారు.

## మాజీ మంత్రి పెద్దిరెడ్డితోపాటు శుభకార్యాల్లో పాల్గొన్న నిస్సార్ అహమ్మద్

మదనపల్లె రూరల్,మేజర్ న్యూస్ : మదనపల్లెలో సీనియర్ నాయకులు నందకుమార్ కుమార్తె మానస వివాహ వేడుకలు,సిటిఎంలో ప్రకాష్ కుమార్తె రోజా నిశ్చితార్థ వేడుకలలో మాజీ మంత్రి,పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,మదనపల్లె వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్,మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి,మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఇందులో భాగం గా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి స్థానిక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కార్యకర్తలు, నాయకులను పేరు,పేరునా ఆప్యాయంగా పలకరించారు. ఈ కార్యక్రమాలలో అక్కులప్ప,వెలుగు చంద్ర,ఆనంద పార్థసారధి,వైసీపి రాష్ట్ర మహిళా కార్యదర్శి రేవతి,యూనస్ పెద్ద సంఖ్యలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.





## తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చినకుమార్తె



రామాపురం మేజర్ న్యూస్: మండలంలోని కసిరెడ్డి రెడ్డి గారి పల్లెకు చెందిన కవిత వెంకట శివయ్య ల కుమార్తె లాస్య 592/600 మార్కులు సాధించి తల్లిదండ్రుల ఆశయాలను నిలబెట్టిన కుమార్తెగా అందరి మన్ననలు పొందగలిగింది. తమ ఇద్దరు ఆడబిడ్డలను బాగా చదివించుకోవాలి అని ఆశయంతో మండలంలోని కసిరెడ్డి గారి పల్లెకు చెందిన వెంకట శివయ్య కడపకు వెళ్లి ఫోటో స్టూడియో పెట్టుకుని జీవనం సాగిస్తూ పిల్లలను చదివించుకుంటూ ఉండేవారు2020 సంవత్సరంలో వెంకట శివయ్య కరోనాతో మృతి చెందాడు. అప్పటినుండి ఫోటో స్టూడియో నడుపుకుంటూ తల్లి కవిత పిల్లలను చదివించుకుంటూ ఉండేది.లాస్యను 6వ తరగతిలో బాలవికాస్ హైస్కూల్ నందు చేర్పించి లాస్య కొన్ని అనివార్య కారణాలవల్ల పదవ తరగతిలో నాలుగు నెలలు స్కూలు వెళ్లకుండా ఇంటి వద్దనే బుసిపోగుల సాయి గణేష్ అనే మాస్టారు వద్ద ట్యూషన్ కు పోతూ పదో తరగతి పరీక్షలు రాసి మెరిట్ మార్కులు సాధించి తల్లిదండ్రుల ఆశయాలను సాధించి అందరి చేత శభాష్ లాస్య అనిపించుకోగలిగింది. దీంతో కసిరెడ్డి గారిపల్లె గ్రామస్తులు తండ్రి లేకపోయినప్పటికీ తల్లి కష్టపడి చదివించిందని గ్రామస్తులు ఆమెను అభినందిస్తున్నారు.

## ఏడవ రోజుకు చేరుకున్న మహాభారత యజ్ఞం



వీరబల్లి, మేజర్ న్యూస్: అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గం వీరబల్లి మండలంలో మట్లీ పంచాయితీలో మాండవ్య నది ఒడ్డున వెలిసిన శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో గత వారం రోజులుగా మహాభారత యజ్ఞం జరుగుతున్నది. శుక్రవారం ఏడో రోజుకు చేరుకుంది. ఈ మహాభారత యజ్ఞంలో పగలుపూట భక్తుల కోసం హరికథ హరికథ భాగవతారిని సీతామాలక్ష్మి సీత హరికథ చెప్పబడుతున్నది. శుక్రవారం పగలు హరికథ అరణ్య పర్వం, కీచక వధ హరికథ చెప్పడం జరిగింది. అదే రోజు పగులు జరిగిన హరికథను,అదే రోజు రాత్రి కళాకారుల ద్వారా నాటకం ప్రదర్శించడం జరుగుతున్నది. అంతేకాక మండలంలోని చుట్టుపక్కల ప్రాంతాల నుండి భక్తులు ప్రజలు విరివిగా పాల్గొని శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో పూజలు చేస్తూ హరికథ కాలక్షేపం చేస్తూ గోవింద నామం పలుకుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నారు. జిల్లాలోనే పేరు పొందిన మట్లీ మహాభారత యజ్ఞం ఎంతో ప్రఖ్యాత గలదు. ఇక్కడ వెలిసిన సీతారామ లక్ష్మణులకు ఎంతో ప్రాముఖ్యత కలదు. నేడు శనివారం అర్జునుడు తపస్సు మాను ఎక్కేఅనే కార్యక్రమం జరుగుతుందని కార్యనిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమాలు ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు, కార్యనిర్వాహకులు చేత జరుపబడుతున్నది.

## నేటి నుండి అంకాలమ్మ తిరుణాల మహోత్సవం



ఒంటిమిట్ట, మేజర్ న్యూస్: ఒంటిమిట్ట మండలం మలకాటపల్లి క్రాస్ కడవ చెన్నై రహదారి ప్రక్కన వెలిసినటువంటి కాల గంగమ్మ అమ్మవారి తిరుణాల మహోత్సవం శనివారం నుండి రెండు రోజులపాటు నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు తిరుణాల సందర్భంగా శనివారం ఉదయం అమ్మవారికి పూజా కార్యక్రమాలు అమ్మవారిని పూలమాలలతో అలంకరణ అభిషేక కార్యక్రమాలు ఉంటాయన్నారు మధ్యాహ్నం బండలాగుడు పోటీలు చెక్కభజన కార్యక్రమాలు అన్న దాన కార్యక్రమం ఉంటుందన్నారు ఆదివారం అమ్మ వారికి పొంగళ్ళు బోనాల కార్య క్రమం ఉంటుందని తెలియజేశారు.



## ఉగ్రమూకల దుశ్చర్యను ఖండించిన సుండుపల్లి మైనారిటీలు



సుండుపల్లి మేజర్ న్యూస్: జమ్ముకాశ్మీర్ పహల్గాంలో చోటుచేసుకున్న ఉగ్రవాద దాడి అత్యంత హేయమైన చర్య అని సుండుపల్లి అగ్రహారం అన్ని మసీదుల నుండి వచ్చిన మండల మైనారిటీ నాయకులు పేర్కొన్నారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన 26 మంది పర్యాటకులను ఉగ్రవాదులు దారుణంగా కాల్చి చంపడం అమానవీయ చర్యగా పేర్కొంటూ, ఈ దుశ్చర్య సంఘటనపై దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. దేశ సమగ్రతను విచ్ఛిన్నం చేయడానికి కొంతమంది విచ్ఛిన్నకారులు, ఉగ్రవాదులు ప్రయత్నం చేస్తున్నారని, దేశమంతా ఒక్కటై ఉక్కు పిడికిలితో ఉగ్రవాదాన్ని కూకటివేళ్ళతో పెకిలించాలన్నారు. ఈ పాశవిక చర్యను ప్రతి ఒక్కరూ ఖండించాలని తెలిపారు. అమాయక పౌరులపై, ముఖ్యంగా పర్యాటకులపై దాడి చేయడం క్షమించరానిదని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు కొరకు మత పెద్దలు సంతాపం తెలిపి, ప్రార్థించడం జరిగింది. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుని అండగా నిలవాలని , క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వారు కోరారు. గాయపడిన వారు వేగంగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. టెర్రరిస్టుల మారణకాండ ఎక్కడా పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల మైనార్టీ నాయకులు మత పెద్దలు యువకులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## వీరబల్లి అటవీ ప్రాంతంలో 8మంది స్మగ్లర్లు అరెస్టు

**-12 ఎర్రచందనం దుంగలు, ఒక మోటారు సైకిల్ స్వాధీనం**




వీరబల్లి, మేజర్ న్యూస్:అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గ వీరబల్లి మండలం అటవీ పరిధిలో 8మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి వారి నుంచి 12 ఎర్రచందనం దుంగలతో పాటు ఒక మోటారు సైకిల్ ను శుక్రవారం టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్స్ (ఆర్ఎస్ఏఎస్టీఎఫ్) హెడ్ శ్రీ ఎల్. సుబ్బారాయుడు గారి ఆదేశాల మేరకు, టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీ పీ శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో డీఎస్పీ శ్రీ జి. బాలిరెడ్డి మార్గనిర్దేశత్వం లో ఆర్ ఐ సాయి గిరిధర్ కు చెందిన ఆర్ ఎస్ ఐ విశ్వనాధ్ టీమ్ స్థానిక ఎఫ్బీఓ అనిల్ కుమార్ తో కలసి గురువారం నుంచి అన్నమయ్య జిల్లా వీరబల్లి అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. శుక్రవారం ఉదయం క్వారీ పాయింట్ వద్ద కొంతమంది వ్యక్తులు, ఒక మోటారు సైకిల్ తో కనిపించారు. వారిని పోలీసులు సమీపించే సరికి వాళ్ళు పారిపోవడానికి ప్రయత్నించారు. దీంతో అప్రమత్తమైన టాస్క్ ఫోర్స్ పోలీసులు వారిని చుట్టుముట్టి పట్టుకున్నారు. చుట్టుపక్కల వెతకగా సమీపంలోని 12 ఎర్రచందనం దుంగలు లభించాయి. పట్టిబడిన వారిని తమిళనాడుకు చెందినవారు గా గుర్తించారు. వారిని తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ కు తరలించగా వారిని డీఎస్పీలు శ్రీ శ్రీనివాసులు రెడ్డి, శ్రీ షరీఫ్ లు విచారించారు. ఎస్ ఐ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అగ్ని ప్రమాదాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి



కలికిరి మేజర్ న్యూస్: అగ్ని ప్రమాదాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక అధికారి షేక్ మస్తాన్ సూచించారు. శుక్రవారం కలికిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు ఆ సమయంలో అగ్నిని ఆర్పే పరికరాలను ఎలా ఉపయోగించాలో వాటి ద్వారా ప్రయోగాత్మకంగా వారికి అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని, ముందస్తు జాగ్రత్తలతో అగ్నిప్రమాదాలు బారి నుండి తప్పించుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వై పవన్ కుమార్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ షేక్ మస్తాన్, ఫైర్ సిబ్బంది నాగిరెడ్డి, వెంకటరమణ, చైతన్య మరియు ఆసుపత్రి వైద్యులు, నర్సులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యంతోనే సంపూర్ణ ఆరోగ్యం...

**-అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి...**



పెద్దమండ్యం, మేజర్ న్యూస్: పెద్దమండ్యం మండలంలో శుక్రవారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆకస్మికంగా పర్యటించారు.ఈ సందర్భంగా మొదట మండల కేంద్రంలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు.అక్కడ తడిచెత్త పొడిచెత్త ప్లాస్టిక్ను వేర్వేరు చేయకుండా ఉండడంపై ఇన్చార్జ్ ఎంపీడీవో శ్రీధర్ రావు, పంచాయతీ సెక్రెటరీ సుబ్రహ్మణ్యంల పని తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రోజు ఎంత చెత్త వస్తుంది ఏ విధంగా కలెక్ట్ చేస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నరు. ప్రతిరోజు చెత్త సేకరణ జరగాలి. తడి పొడి చెత్తలను, ప్లాస్టిక్ తప్పనిసరిగా వేరు చేయాలని పేర్కొన్నారు.పారిశుద్ధ్యంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం, రహదారుల పక్కన పేరుకున్న చెత్త లను తొలగించాలని నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ వెంట మండల అధికారులు తదితరులు ఉన్నారు.

## ఉద్యమ కారునికి ఎమ్మార్పీఎస్ అశ్రునివాళి

తంబళ్లపల్లె మేజర్ న్యూస్: గత 30 ఏళ్ల క్రితం ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్రస్థాయిలో మందకృష్ణ మాదిగ ఉద్యమ స్ఫూర్తితో తంబళ్లపల్లె మండలంలో ఎమ్మార్పీఎస్ స్థాపించిన నాగ మల్లయ్య చిరస్మరణీయుడు. మండలంలోని గుండ్లపల్లి కు చెందిన నాగమల్లయ్య ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షుడుగా జిల్లా స్థాయి నాయకుడిగా ఉద్యమంలో పాల్గొని ఎస్సీ వర్గీకరణ సాధించిన రోజే అమరుడు కావడం యాదృచ్ఛికం. ఆయన అనారోగ్యంతో మృతి చెందడం ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి తీరని లోటని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి నరేంద్ర మాదిగ, తంబళ్లపల్లె ఇంచార్జ్ వేటా మల్లికార్జునులు తెలిపారు. నాగమల్లయ్య అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోసి ఆయనకు ఘనంగా నివాళు లర్పించి ఆయన కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

# విద్యకు పుట్టినిల్లు శ్రీ శివ పార్వతి హై స్కూల్

▪ ఘనంగా 31వ వార్షికోత్సవ వేడుకలు ▪ ఆకట్టుకున్న చిన్నారుల నృత్యాలు ▪ విద్యా సంస్థ ద్వారా అనేకమంది ఉన్నత చదువులు ▪ నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం ▪ విద్యాసంస్థల అధినేత సోమ బాలాజీ బాబు




**పుల్లంపేట, మేజర్ న్యూస్ :** స్థానిక పుల్లంపేట మండల కేంద్రంలోని శ్రీ శివ పార్వతి హై స్కూల్ నందు పాఠశాల 31వ వార్షికోత్సవ మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా రాజంపేట మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ అయినటువంటి బి. వినోద్ కుమార్ ,పుల్లంపేట మండల విద్యాశాఖ అధికారి చక్రధర , మొల్ల సాహితీ పీఠం మహిళా అధ్యక్షురాలు జి.పి హైమావతి హాజ రవ్వడం జరిగినది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాం డెంట్ సోము బాలాజీ బాబు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్యార్థుల తల్లిదండ్రులు కేవలం మార్కులకే ప్రాధాన్యమిస్తున్నారని కానీ అవి నిత్యజీవితంలో వాటి వలన ఉపయోగం లేదని, విలువలతో కూడినటువంటి అభ్యసనం పిల్లలకి ఎంతో ముఖ్యమని పిల్లలను ఉద్దేశించి మాట్లాడడం జరిగినది. అదేవిధంగా ముఖ్య అతిథులు అయినటువంటి రాజంపేట మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ అయినటువంటి వినోద్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు క్రికెట్ బెట్టింగ్స్ కు మరియు మొబైల్ ఫోన్స్‌కి దూరంగా ఉండి చదువుల పట్ల ఆసక్తిని పెంపొందించుకొని కన్న తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని వారు విద్యార్థులకు సూచించడం జరిగినది. మరొక ముఖ్య అతిథి అయినటువంటి పుల్లంపేట మండల విద్యాశాఖ అధికారి అయినటువంటి చక్రధర మాట్లాడుతూ పిల్లలు ఎక్కువగా వ్యసనాలకు గురవుతున్నారని సమాజంలో డ్రగ్స్ అనే మహంకారి ఎక్కువగా వ్యాప్తి చెందుతుందని అలాంటి వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత చదువులు దిశగా విద్యార్థుల జీవనం కొనసాగించాలని తెలియ జేయడం జరిగినది. మొల్ల సాహితీ పీఠం మహిళా అధ్యక్షురాలు హైమావతి మాట్లాడుతూ గతంలో పాఠశాల ఎంతోమంది విద్యార్థులకు ఉచితంగా చదువు చెప్పడం జరిగిందని, ప్రస్తుతం ఉన్నటువంటి పోటీ ప్రపంచంలో ఈ ఉచిత విద్యను ప్రైవేట్ పాఠశాలగా మార్చడం జరిగిందని గతంలో ఎంతోమంది పేద విద్యార్థులకు ఉన్నత చదువులు చెప్పినటువంటి సంస్థ శ్రీ శివ పార్వతి విద్యాసంస్థలకే చెందుతుందని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా విచ్చేసినటువంటి వీరందరూ పాఠశాలలోని విద్యార్థులకు 2024-2025 విద్యా సంవత్సరమునకు సంబంధించినటువంటి మొదటి, ద్వితీయ మరియు తృతీయ ర్యాంకర్స్ కు, మరియు 100 శాతం అటెండెన్స్ గల విద్యార్థులకు, బెస్ట్ స్టూడెంట్స్ గల విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేయడం జరిగినది. సాంస్కృతిక కార్యక్రమములో భాగంగా విద్యార్థులు చేసినటువంటి నృత్యాలు, డ్రామాలు, కామెడీ సన్నివేశాలను ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అదేవిధంగా






ఈ కార్యక్రమానికివిద్యార్థుల తల్లిదండ్రులు భారీ స్థాయిలో హాజరైపాఠశాలయాజమాన్యం అందించు తేనేటి విందును స్వీకరించడం జరిగినది. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా హాజరైనటువంటి వారందరికీ పాఠశాల కరస్పాండెంట్ సోము బాలాజీ బాబు,పాఠశాల జనరల్ సెక్రెటరీ శ్రీమతి సోము నాగ లతా, పాఠశాల అకాడమిక్ ఇంచార్జ్ సోము నిత్యానంద , మరియు పాఠశాల ఇన్చార్జ్ సోము సాయి రూపేష్ ఆధ్వర్యంలో అతిథులను ఘనంగా సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయులు హరి, ఎగ్జామినేషన్ ఇంచార్జ్ రేఖ, అలీ,రమణ, గీత, మహేశ్వరి, మల్లేశ్వరి, వనజ,సుజాత, చిత్రా జ్యోతి ,శిరీష,నందిని తదితర ఉపాధ్యాయులు విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొనడం జరిగినది.

# ఉగ్రవాదం,మతోన్మాదం నశించాలి

– ప్రపంచ శాంతి వర్ధిల్లాలి:యుటిఎఫ్



**రాజంపేట,మేజర్ న్యూస్ :** జమ్మూ కాశ్మీర్ అనంతనాగ్ జిల్లా పెహల్ గావ్ లోని బైసరీన్ వ్యాలీలో పర్యటిస్తున్న సందర్శకులపై కాల్పులు జరిపిన ఉగ్రవాదులను వెంటనే శిక్షించాలని ఈ చర్య చాలా హేయమైనదని ,అనాగరిమనియుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరి ప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్ చెంగల్ రాజు, జిల్లా కార్యదర్శి వెంకట సుబ్బయ్య తదితరులు పేర్కొన్నారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈ దుర్ఘటనను నిరసిస్తూ, అమరులైన వారికి జోహార్లు అర్పిస్తూ కొవ్వొత్తులతో రాజంపేట ప్రభుత్వ కళాశాల మైదానంలో శాంతి ర్యాలి చేపట్టడం జరిగింది. ఈ దుశ్చర్య ను పలువురు ఉపాధ్యాయులు, ఉద్యోగులు,పెన్షనర్లు ఖండించడం జరిగింది. చనిపోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని నివాళులు అర్పిం చడం జరిగినది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వాలు సైనిక బలాన్ని ప్రతి ఏడాది రిక్రూట్మెంట్ ల ద్వారా పెంచుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటన పునరావృతం కాకుండా దేశ సరిహద్దులను కట్టుదిట్టం చేయాలి. దాదాపు 140 కోట్ల జనాభా ఉన్న భారతదేశంలో దేశం కోసం ప్రాణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని, విద్యార్థులను డాక్టర్లు ఇంజనీర్లుగా కాక ప్రభుత్వంలోని అన్ని రంగాలతో పాటు సైనిక రంగంలో కూడా తమ ప్రాతినిధ్యం ఉండేటట్లుగా ప్రోత్సహించడానికి సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా తెలియజేశారు. మతతత్వం కంటే మానవత్వం గొప్పది మన స్వార్థాన్ని వీడి దేశ రక్షణ కోసం దేశ సమైక్యతను కాపాడడానికి ప్రతి ఒక్కరు నడుం బిగించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రమణయ్య , గోపాల కృష్ణ,శివయ్య, శివకుమార్ , విశ్వనాథ్, కిషోర్,రవి చంద్ర ప్రసాద్, నాగరాజు , నరసింహా రావు,,వెంకట రమణ,నరేష్, యోగానందం, సుబ్బారావు, పెన్షనర్లు శశిధర్ , వెంకటేశ్వర రెడ్డి, ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అందరిలో మార్పు వస్తే – మలేరియా అంతమవుతుంది

**సిద్ధవటం మేజర్‌న్యూస్ :** ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా, జాతీయ, కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పి కొత్తపల్లి, మాధవరం, సిద్ధవటం ప్రభుత్వ వైద్యశాలలో దోమల వ్యాప్తిని అరికట్టు టకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు మండల కేంద్రమైన సిద్దవటం కమ్యూనిటీ వైద్యశాలలో శుక్రవారం డాక్టర్ ప్రకాష్ మాట్లాడుతూ ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా కీటకజనిత వ్యాధి నియంత్రణ దోమల నిర్మూలనకై పరిసర ప్రాంతాలు శుభ్రంగా పెట్టుకోవాలని అందరిలో మార్పు వస్తే మలేరియా అంతం అవుతుందనిరాత్రివేళదోమకుట్టినచో మలేరియా జ్వరం వ్యాపిస్తుందని కుట్టకుండా తగు జాగ్రత్తలు పాటించాలని మలేరియా లక్షణాలు ఉన్నవారుసమీపప్రభుత్వ వైద్యశాలలో వైద్యం సలహాలు తీసుకోవాలని తెలియజేశారు మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్ల



సుబ్బరాయుడు మాట్లాడుతూ దోమల నివారణ కొరకు చుట్టుపక్కల ప్రాంతాలలో నీరు నిలువ లేకుండా చూడాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంల వైద్యాధికారులు డాక్టర్ ప్రకాష్, దీపక్, సాయి వరప్రసాద్, లక్ష్మీకర్, హరి హరన్, శ్రీవాణి వైద్య సిబ్బంది పాల్గొన్నారు

# పది ఫలితాలలో సత్తా చాటిన మూరి రమ్యశ్రీ



**పుల్లంపేట, మేజర్ న్యూస్:** ఇటీవల వెలువడిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో రాజంపేట రాజు హై స్కూల్ నందు చదువుతున్న వత్తలూరు కి చెందిన మూరి రమ్యశ్రీ 590 మార్కులతో సత్తా చాటింది. రాజంపేటలోని రాజు హై స్కూల్ నందు పదవ తరగతి అభ్యసించిన విద్యార్థిని 590 మార్కులు సాధించి టాప్ టెన్ లో నిలవడం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా రమ్యశ్రీ మాట్లాడుతూ పదవ తరగతి ఫలితాలలో 590 మార్కులు రావడం ఆనందంతో పాటు కొంచెం బాధ కూడా కలిగిందని, అయితే భవిష్యత్తులో మరింతగా కష్టపడి చదివి, తల్లిదండ్రులకు, గ్రామానికి, విద్యాసంస్థలకు మంచి పేరు తీసుకువచ్చి గొప్ప స్థాయిలో ఉండేందుకు కృషి చేస్తానని, ఇందుకు సహకరించిన కుటుంబ సభ్యులకు, రాజు పాఠశాల యాజమాన్యానికి, ఉపాధ్యాయులకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని, భవిష్యత్తులో కూడా మంచి మార్కులు సాధించి మంచి పేరు తీసుకు వస్తానని రమ్యశ్రీ తెలియజేసారు.

# దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు



**ఒంటిమిట్ట, మేజర్ న్యూస్ :** ఒంటిమిట్ట మండలం కడప చెన్నై రహదారి ఒంటిమిట్ట చెరువు గట్టుపై వెలసిన శ్రీ దుర్గా దేవి అమ్మవారికి శుక్రవారం ఆల అర్చకులు ఎర్రటి వస్త్రాలతో అమ్మవారిని అలంకరించి కుంకుమాభిషేకం పంచా మృతాభిషేకం పూజలు నిర్వహించి భక్తు లకు తీర్థ ప్రసాదాలు అందించారు అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారికి కాయ కర్పూరం సమర్పించారు అనంతరం ఆలయ కమిటీ సభ్యులు దాతలచే ఉచిత అన్నదాన కార్యక్రమం చేపట్టడం జరిగింది ఈ కార్యక్రమంలోభక్తులు పాల్గొన్నారు.



# మదర్ థెరిస్సా ఆశయాలకు అనుగుణంగా వెలుగు సంస్థ సేవలు

– అట్టహాసంగా 27వ వార్షికోత్సవ వేడుకలు – ఉదయ మోహన్ రెడ్డి,భాగ్యలక్ష్మిల సేవలను కొని యాడిన వక్తలు




**మదనపల్లె రూరల్,మేజర్ న్యూస్ :** ప్రేమతో అందించే సేవలు వెలకట్టలేని నాడు మదర్ థెరిస్సా ప్రపంచానికి చాటారని,ఆమె ఆశయాలకు అమ్మ చెరువుమిట్ట నందు వెలుగు సంస్థలో దివ్యాంగులు,వయోవృద్ధులకు సేవలం దిస్తున్నారని కొనియాడారు వక్తలు కొనియాడారు.వెలుగు సంస్థ 27వ వార్షికోత్సవ వేడుకలు సంస్థ ప్రాంగణంలో శుక్రవారం అట్టహాసంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా విభిన్న ప్రతిభావంతులు,హిజ్రాలు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణ కిశోర్,అమృత హాస్పిటల్స్ అధినేత గోపి కృష్ణ,శ్రీకృష్ణ గ్రూప్స్ అధినేత శశి ధర్ రావు,వెల్ఫేర్ డిపార్ట్మెంట్ సూపరింటెండెంట్ అనిల్,ఆర్.ఓ శ్రీకాంత్,దర్శిని స్పెషల్ స్కూల్ గోవింద రెడ్డి,వెలుగు ప్రెసిడెంట్ రమణరావు, వెలుగు ఓల్డ్ ఏజ్ హోమ్ సూపరింటెండెంట్ ఎం.ఉదయ్ కుమార్ రెడ్డి,ట్రెజరర్ రఘునాథ్ రెడ్డి,వెలుగు సెక్రటరీ ఎం ఉదయ్ మోహన్ రెడ్డి,కన్వీనర్ భాగ్యలక్ష్మి,ఈ.సి మెంబెర్ సుజాత,ప్రిన్సిపాల్ లీనా కుమారిలు వేదికను అలంకరించగా చిన్నారులు అతిధులను పుష్ప గుచ్చాలతో స్వాగతం పలికారు.ముందుగా వెలుగు సంస్థ వ్యవ స్థాపకురాలు స్వర్గీయ శ్రీమతి పద్మజ చిత్రపటానికి పూజ కార్యక్రమాన్ని ముఖ్య అతిథుల చేతుల మీదగా జరిపించి,జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.తదుపరి స్వాగతం పాటతో చిన్నారులు తమ నృత్య ప్రదర్శనలతో అందరిని అలరించారు.యునైటెడ్ స్కూల్స్ ఆర్గనైజేషన్ వారిచే నిర్వహించిన మూకీ డ్రామా పోటీలలో ఆల్ ఇండియా వైడ్ లో ఉతీర్ణత సాధించిన చిన్నారులకు కృష్ణ కిశోర్,ఎం.ఉదయ్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్లు,బ్యాడ్జులు,మెడల్స్ అందజేశారు. అమృత హాస్పిటల్స్ గోపికృష్ణ మాట్లాడుతూ మదనపల్లెలో నడిచే మదర్ థెరెస్సాలు మన వెలుగు సిబ్బందని కొనియాడారు.కీర్తిశేషులు పద్మజ ఎంతో దృఢ సంకల్పంతో ఈ సంస్థను ప్రారంభించారని,అది ఈ నాడు 27వ సంవత్సరాలు ఎనలేని సేవలను దివ్యాంగులకు,వృద్ధులకు అందిస్తూ ఇంకా ఇలాంటి వార్షికోత్సవాలు మరెన్నో పూర్తి చేసుకోవాలని కోరారు.ఈ గొప్పయజ్ఞాన్ని ముందుకు తీసుకువెళ్తున్న ఉదయ్ మోహన్ రెడ్డి,భాగ్యలక్ష్మికి అభినందలు తెలిపారు.ఈ కార్యక్రమంలో చిన్నారులు యోగ విన్యాసాలతో అందరిని అలరించారు.ఇంత గొప్పగా నేర్పించిన యోగ మాస్టర్ అనితకి మొమెంటోను అందజేసి శాలువాతో సత్కరించారు.ఇన్ని సంవత్సరాలు వెలుగు సంస్థతో మంచి అనుబంధం ఉన్న విభిన్న ప్రతిభావంతులు,హిజ్రాలు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.వి.క్రిష్ణ కిషోరుని శాలువాతో సత్కరించి,మొమెంటోను అందజేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా కృష్ణ కిశోర్ మాట్లాడుతూ వెలుగుతో తనకున్న అనుబంధాన్ని అందరితో పంచుకున్నారు. అనంతరం చిన్నారులు,వారి తల్లిదండ్రులు, ముఖ్య అతిధులు అందరూ ప్రేమ విందులో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వెలుగు ఈ.సి మెంబర్ సుజాత,ప్రిన్సిపాల్ లీనా కుమారి,సోషల్ వర్కర్ గీత,వార్డెన్ స్వీటీ,వెలుగు సిబ్బంది ,వృద్ధులు, చిన్నారులు,వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా స్థిరపడాలి

తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ దాసరిపల్లి జయచంద్ర రెడ్డి



**ములకలచెరువు, మేజర్న్యూస్ :** ములకలచెరువు మండలం నాయనచెరువుపల్లి రోడ్డులోని జేకే కాంప్లెక్స్ వద్ద శుక్రవారం మహిళ కుట్టు మిషన్ల శిక్షణా కేంద్రమును తంబళ్లపల్లె నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ దాసరిపల్లి జయచంద్రారెడ్డి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళలు దాసరిపల్లి జయచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా సన్మానించారు. అనంతరం శిక్షణా కేంద్రములో పూజా కార్యక్రమంలో పాల్గొని శిక్షణా కేంద్రమును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మహిళలకు ఎటువంటి ప్రాధాన్యత లేదని మన కూటమి ప్రభుత్వం మహిళా పక్షపాత ప్రభుత్వమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మరియు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేదింటి మహిళలు ఆర్థికంగా స్థిరపడాలని ఉదేశంతో వారికి కుట్టుమిషన్ల శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని మహిళా సోదరీమణులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని సొంత ఉపాధి ఏర్పరచుకునేలా శిక్షణ పొందాలని రానున్న రోజుల్లో మన నియోజకవర్గం లోనే గార్మెంట్స్ పరిశ్రమ ఏర్పడుతుందని కూటమి ప్రభుత్వంలో మహిళలకు అధిక ప్రాధాన్యం ఉంటుందని రానున్న రోజుల్లో మహిళల కై అనేక శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని మహిళలు సొంత వ్యవస్థాపకులు గా అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ హరినారాయణ, ఏపిఎం మధు శేఖర్ బాబు, ఏరియా కో ఆడినేటర్ గంగాధర్ , రాష్ట్ర సివిల్ సర్వీసెస్ మెంబర్ పర్వీన్ తాజ్ , టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు తులసీధర్ నాయుడు , రాష్ట్ర టిడిపి బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు ,కురబలకోట కన్వీనర్ వైజి సురేంద్ర, ఆడినేటర్లు గీత రాణి మరియు తంబళ్లపల్లి నియోజకవర్గ మహిళలు మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# పహల్గాం ఉగ్రవాద దాడి మృతులకు అశ్రునివాళి

– దేశంలో ఉగ్రమూకలను అంతమొందించాలి – విశ్వహిందూ పరిషత్ మదనపల్లి సమితి డిమాండ్

**మదనపల్లె,మేజర్న్యూస్** : కశ్మీర్ పహల్గాం లో జరిగిన ఉగ్ర వాద దాడిలో అమా యకులైన హిందువులని కక్షపూరితంగా హిం దువా కాదా అని నిర్ధారించుకొని అత్యంత కిరాతంగా కాల్చి చంపడాన్ని విశ్వ హిందూ పరిషత్ మదనపల్లి సమితి తీవ్రంగా ఖండించింది. ఇందులో భాగంగా శుక్రవారం స్థానిక చిత్తూరు బస్టాండ్ వాల్మీకి సర్కిల్ వద్ద ఉగ్రమూకల కాల్పుల్లో మృతిచెందిన 28 మందికి అశ్రు నివాళు లర్పించారు. అదే విదంగా మరో 40 మంది క్షతగాత్రులు కావ డం బాధాకరమన్నారు.మరణించిన వారం దరికి విశ్వహిందూ పరిషత్ ఆద్వర్యంలో అశ్రు నివాళులర్పించి దుర్మార్గపు చర్యలకు పాల్పడిన ఉగ్రమూకలనువెంటనేకఠినంగాశిక్షించాలనిడిమాండ్ చేశారు.ఇలాంటి ఉగ్రవాద చర్యలు తిరిగి పునరావృతం కాకుండా అధికార యత్రాంగం పటిష్టమైనచర్యలు తీసుకావాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో



విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు గట్టి రామమోహన్,కార్యదర్శి సురేష్ బాబు,సహ కార్యదర్శులు రమణా రెడ్డి,నాగప్రసాద్ నాయుదు, సుధాకర్,రామ మూర్తి, హేమనాథ్, గాంధీ, రెడ్డెప్ప, సుబ్బారెడ్డి, హరి, వాసుదేవరెడ్డి,వి. హెచ్.పి కార్యకర్తలుహిందూబాంధవులు పాల్గొన్నారు.

# ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించిన డాక్టర్ రూబీన్




**సుండుపల్లి మేజర్న్యూస్:** ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా రాయవరం ప్రభుత్వ వైద్యశాల పరిధిలో డాక్టర్ రూబీన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రూబీన్ మాట్లాడుతూ మలేరియా ఆడ అనాఫిలాస్ దోమకాటు ద్వారా వస్తుందని, ఈ దోమ మంచినీటిలో పెరుగుతుందని మలేరియా అనేది రెండు రకాల అని పివైవాక్స్, పి ఫాల్సిపారం మలేరియా అని మలేరియా సోకిన వారికి చలి జ్వరం, తలనొప్పి కండరాల నొప్పి ఉంటాయని తెలిపారు. మలేరియా అనే వ్యాధి రాకుండా ఉండడానికి ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి ప్రతి ఒక్కరు దోమతెరలు వాడాలి. దోమల నివారణ అనేది మన అందరి బాధ్యతగా తీసుకోవాలిని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ వీరనారాయణ, సిహెచ్ఓఎస్, ఏఎన్ఎంలో ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# మలేరియా అంతం ప్రతి ఒక్కరి పంతం

**రాజంపేట ,మేజర్న్యూస్ :** ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్బంగా డిప్యూటీ డిఎంఅండ్హెచ్ఓ డాక్టర్ శేఖర్ ఆధ్వర్యంలో ఈడిగపాలెం, మన్నూర్ అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బందితో" మలేరియా అంతం మనతోనే " దోమ కుట్టకూడదు దోమ పుట్ట కూడదు నినాదం ర్యాలీ మరియు సదస్సు జరపడం జరిగినది. డిప్యూటీ డిఎం అండ్హెచ్వో డాక్టర్ శేఖర్ మాట్లాడుతూ మలేరియా వ్యాధి ఏనాఫిలిస్ ఆడ దోమ కుట్టడము ద్వారా వస్తుందని ,ఈ దోమలు, ఇండ్లలో మంచి నీళ్లులో పెరుగుతాయి అని, అందువలన ఫ్రైడే డ్రైడే ప్రోగ్రామ్ లోనీళ్లు నిలువ చోట ప్రతి గ్రామములో హెల్త్ స్టాఫ్, సచి వాలయం సిబ్బంది, అందరు లార్వా దశలోనే అబేట్ ద్రావణం తో పిచికారీ చేసి, మలేరియా మీద ప్రజలకు అవగాహనా కల్పించాలని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చైతన్య.. డాక్టర్..స్నేహలత, డాక్టర్.. రాజశేఖర్, మలేరియా సబ్ యూనిట్ ఆఫర్., ఎస్ ఎస్ దాస్. ఎమ్ ఎల్హెచ్పిలు, ఏఎన్ఎం లు పాల్గొన్నారు.



# కేశఖండనశాలల్లో పనిచేస్తున్న నాయిబ్రాహ్మణుల కమిషన్ పెంపు శుభపరిణామం

– టిడిపి నాయి బ్రాహ్మణ సాధికార సమితి సభ్యులు మంగళ ప్రభాకర్ హర్షం



**మదనపల్లె టౌన్,మేజర్ న్యూస్ :** దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోని 6ఏ ఆలయాల కేశ ఖండన శాలల్లో పనిచేస్తున్న నాయిబ్రాహ్మణుల కనీస వేతన కమిషన్ 20 నుంచి 25 వేలకు పెంచుతూ ఏపీలోని కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడం శుభపరిణామమని టిడిపి రాష్ట్ర నాయి బ్రహ్మణ సాధికార సమితి నాయకులు మంగళ ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ నాయిబ్రాహ్మణ సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కొనియాడారు. ఆలయాల్లో పనిచేస్తున్న నాయి బ్రాహ్మణుల ఇబ్బందులను దృష్టిలో ఉంచు కొని వారి కమిషన్ 25 వేలకు పెంచడం సీఎం చంద్రబాబు నాయుడి చిత్తశుద్ధికి నిదర్శనన్నారు. నాయి బ్రాహ్మణ శ్రేయస్సు కోసం కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ బాబులకి నాయి బ్రాహ్మణులతరపునకృతజ్ఞతలుతెలి య జేస్తున్నామన్నారు. మదనపల్లి తెలుగుదేశం పార్టీ నాయిబ్రాహ్మణులసంఘం రామ కృష్ణ, మనోహర్, మంజునాథ్, ఈశ్వర్, నారప్పపాండు, నాగరాజు, పాండు, శ్రీకాంత్, నవీన్ పాల్గొన్నారు.

# పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య

– హెల్పింగ్ మైండ్స్ కార్యాలయంలో మృతులకు కొవొత్తులతో నివాళి



**మదనపల్లె టౌన్,మేజర్న్యూస్ :** కశ్మీర్ పర్యాటక కేంద్రం పహ్లాగం పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద దాడిని ఖండిస్తూ ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకుల కుటుం బాలకు సానుభూతి తెలియజేస్తూ కొవ్వొత్తులతోహెల్పింగ్మైండ్స్ కార్యాలయం లో హెల్పింగ్ మైండ్స్ బృందం నివాళు లర్పించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగ్రవాదంతో దేశానికి ప్రమాద కర మన్నారు. ఉగ్రవాదాన్ని అంతమొందిస్తే ఇటు వంటి సమస్యలు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్ సిద్ధిక్, వాలంటరీ బ్లడ్ బ్యాంక్ అధికారిబాలచంద్ర నాయుడు, సంస్థ సభ్యులు దినకర్, చైతు, కిరణ్, రష్మిక సాంబ, చరణ్, నవీన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేషన్ రుణాల మంజూరులో లబ్ధిదారులకు అన్యాయం

– పలుకుబడి ఉన్నవారికి వత్తాసు పలుకుతున్న అధికారులు

– టిడిపి మైనార్టీ నాయకులు మహబూబ్ ఖాన్ ఆరోపణలు

**మదనపల్లె టౌన్,మేజర్న్యూస్ :** చేతివృత్తులు, చేతి వృత్తుల వారిని ఆర్థికంగా సహకారం అందించేందుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేసేందుకు శ్రీకారం చుట్టిందని టిడిపి మైనార్టీ నాయకులు, తెలుగు యువత రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షులు మహబూబ్ ఖాన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మదనపల్లె మండల పరిధిలో చాలామంది అర్హులు ఈ రుణాలకు దరఖాస్తు చేసుకొని ఇంటర్వ్యూలు పూర్తి చేసుకున్నారని, అయితే మదనపల్లి ఎంపీడీవో పూర్తయిన దరఖాస్తులను బ్యాంకులకు చేరవేయకుండా తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారన్నారు. అంతేకాకుండా తమకు అనుకూలమైన వారికి వత్తాసు పలుకుతూ ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పొడుస్తున్నార న్నారు.



కార్పొరేషన్ రుణాలు అంటే అది కేవలం పేదవారికి మాత్రమే వర్తించా లన్నారు. ఆలాకాకుండా రికమండేషన్ కలిగిన వారికి ప్రాధాన్యతనివ్వడం బాధాకర మన్నారు. ఈ విషయంపైలబ్ధిదారులతోకలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ బాబులకుఫిర్యాదుచేస్తామన్నారు. ఇప్పటికైనా ఎంపీడీవో అర్హత ఉన్న లబ్ధిదారులకు కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలని, లేని యెడల ఎంపిడిఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

# సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలి

– హంద్రీ – నీవా నీటితో చెరువులను,కుంటలను నింపాలి




**బి.కొత్తకోట,మేజర్న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు పేదలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పీటియం రోడ్డు నందు గల కార్యాలయం నందు, సిపిఐ తంబళ్లపల్లె నియోజకవర్గపు కార్యవర్గ సమావేశం ఆ పార్టీ ములకలచెరువు మండల కార్యదర్శి కే.అంజనప్ప అధ్యక్షతన జరిగింది. తొలుత జమ్మూ కాశ్మీరులోని పహల్గాంలో ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి ఐదు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న పి.ఎల్.నరసింహులు, జిల్లా కార్యవర్గ సభ్యులు టి.కృష్ణప్ప లు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు సానుకూలమైనప్పటికీ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నదని, తల్లికి వందనం హామీ అమలు చేయకపోవడం వల్ల పిల్లల ఫీజులు తల్లిదండ్రులకు భారమై చదువులకు దూరమయ్యే పరిస్థితి నెలకొందని, రాష్ట్రంలో ఒకవైపు అతివృష్టి ఇంకొక వైపున అనావృష్టితో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్నారని ఆవేదన చెందారు. విశాఖలో పెద్దపెద్ద కార్పొరేట్లకు లక్షలాది ఎకరాల భూమిని ధారాదత్తం చేస్తున్న కూటమి ప్రభుత్వం పేదలకు ఇంటి నివేశం కొరకు రెండు సెంట్లు స్థలాన్ని ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. ముఖ్యంగా జిల్లాలోని పడమటి ప్రాంతంలో తీవ్రమైన నీటి ఎద్దడి నెలకొని ఉందని, వ్యవసాయ బోర్లు నందు నీరు తగ్గిపోవడంతో రైతాంగం దిక్కుతోచని పరిస్థితుల్లో పంటలు వేయడానికి వెనుకాడుచున్నారని, అసలు తాగునీరు కూడా ఉంటుందో ఉండదో అన్న అనుమానాలతో ప్రజానీకం ఆందోళన చెందుతున్నారని వాపోయారు. హంద్రీ-నీవా కాలువ ద్వారా జలాలను తరలించి జిల్లాలోని అన్ని చెరువులను, కుంటలను నింపి త్రాగునీరు, సాగునీరు అందించి ప్రజానీకాన్ని ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ నియోజకవర్గపు కార్యదర్శి ఎస్.మనోహర్ రెడ్డి, సీనియర్నాయకులుఎస్.బషీర్ ఖాన్, జి.రఘునాథ్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలతోపాటు ఇదివరకే రెవిన్యూ కార్యాలయాలలో అర్జీలు సమర్పించిన అర్హులైన పేద లందరికీ ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చి, ఇంటి నిర్మాణానికి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం నాలుగు లక్షల రూపాయలు ఆర్థిక సాయం అందిం చాలన్నారు. రేషన్ కార్డులు, వితంతు, వికలాంగ, వృద్ధాప్య, ఒంటరి మహిళ తదితర పింఛన్లు వెంటనే ఇవ్వాలని, పేదలు నివసించే ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, మహిళలకు నిరుద్యోగ యువకులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్చేశారు. ఈకార్యక్రమంలోసిపిఐకార్యవర్గసభ్యులు యం.అష్రఫ్ అల్లి, ఎస్.తంబయ్యశెట్టి, పి.నారాయణస్వామి, పి.మంజునాథ్, ఎం.గంగులప్ప, జి.నారాయణ స్వామి, రెడ్డెప్ప, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులను తనిఖీ చేపట్టిన ఏపీఓ



**సిద్ధవటం మేజర్ న్యూస్ :** ఉపాధి హామీ పని తనిఖీల్లో భాగంగా ఉప్పరపల్లి, మాధవరం గ్రామాలు ఉపాధి హామీ పనులను శుక్రవారం ఏపీవో నరసింహులు ఆకస్మిక తనిఖీ చేపట్టి కూలీల నమోదు పరిశీలించారు మండల కేంద్రమైన సిద్దోటం ఉపాధి హామీ కార్యాలయంలో ఏపీఓ నరసింహులు మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో తనిఖీల్లో భాగంగా ఉప్పరపల్లి, మాధవరం గ్రామాల్లో చేపడుతున్న కాలువ, కందకాలు పనులను తనిఖీ చేసి ఉపాధి హామీ కూలీల సంఖ్య పరిశీలించామని కూలీలకు పనులు చేసిన రోజులకు జనవరి నెల నుండి మార్చివరకునగదుచెల్లింపు చేశామని ఎండాకాలం దృష్టిలో పెట్టుకొని కూలీలు జాగ్రత్త వహించి పనులు చేసుకోవాలని ఆయన అన్నారు

# భవన నిర్మాణ అనుమతులు ఆన్లైన్ ద్వారానే పొందాలి

పంచాయితీ కార్యదర్శి రామచంద్ర

**సుండుపల్లి మేజర్ న్యూస్ :** సుండుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో భవన నిర్మాణాలు చేస్తున్న యజమానులకు సుండుపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి ముఖ్య ప్రకటనను తెలియజేశారు. సుండుపల్లె గ్రామపంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న భావన నిర్మాణ అనుమతులను ఆన్లైన్లో కడప అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ద్వారా మాత్రమే తీసుకోవాలని తెలియజేశారు. అలా కాకుండా కొందరు దళారులు మోసపూరితంగా పాత తేదీలను తీసివేసి బ్లూ ప్రింట్ ద్వారా ఆఫ్ లైన్ అనుమతులు ఇస్తున్నట్లు తెలుసుకుందామని అలా దళారులు చెప్పిన మాయ మాటలు విని నష్టపోకుండా ఉన్నందుకుపత్రికాముఖంగాప్రకటననువిడుదల చేస్తున్నామని తెలిపారు. ఇంక నుండి భవన నిర్మాణం యజమానులు భవన నిర్మాణ అనుమతులు కావాలంటే గ్రామపంచాయతీ అధికారులను సంప్రదించి ఆన్లైన్లో మాత్రమే అనుమతులు పొందాలని పంచాయతీ కార్యదర్శి రామచంద్ర తెలిపారు.

# జమ్మూ కాశ్మీర్ ఉగ్రవాద దాడిపై జనసేన నాయకులు నిరసన




**రైల్వే కోడూరు రూరల్ మేజర్ న్యూస్ :** జమ్మూ కాశ్మీర్లోని బైసరన్ ప్రాంతంలో జరిగిన ఉగ్రదాడి ఘటనలో 28 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటనపై జనసేన పార్టీ నాయకులు తీవ్రంగా ఖండన వ్యక్తం చేసింది. ఈ దుశ్చర్యను ఖండిస్తూ మృతులకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సంతాపం తెలిపారు. ఈ ఘటన పై నిరసన తెలియజేస్తూ జనసేన పార్టీ తరఫున మూడు రోజుల పాటు సంతాప కార్యక్రమాలు నిర్వహించాలంటూ జనసేన నాయకులకు పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా మానవ హారాలు నిర్వహించి ఉగ్రవాద దాడిని నిరసించాలంటూ ఆదేశించారు. ఈ ఆహ్వానానికి స్పందనగా రైల్వే కోడూరు పట్టణంలోని మెయిన్ రోడ్లో ప్రభుత్వ విప్ రైల్వే కోడూరుఎమ్మెల్యే అరవ శ్రీధర్ నేతృత్వంలో భారీ స్థాయిలో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు, స్థానిక ప్రజలుభారీసంఖ్యలోపాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ దేశభద్రతకుముప్పుగామారుతున్న ఉగ్రవాదాన్నిదేశప్రజలంతాకలిసికట్టుగా ఎదుర్కోవాలనిఅన్నారు. అమాయకులపై దాడి చేయడం అమానుష చర్య ఇలాంటి దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. జనసేన పార్టీ తరఫున మృతుల కుటుంబాలకు ప్రగాఢసంతాపంతెలియజేస్తూబాధిత కుటుంబాలకు ప్రభుత్వం తగిన పరిహారం ఇవ్వాలని డిమాండ్చేశారు . ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్రకార్యదర్శి తాతం శెట్టి నాగేంద్ర జనసేన నాయుకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.



# దృష్టి లోపం గల వ్యక్తుల కోసం సేఫ్ స్టెప్ ఆవిష్కరణ

– విశ్వం విద్యార్థులకు ఏపిఎస్.సీ.హెచ్.ఈ ప్రతిష్టాత్మక అవార్డు

**కురబలకోట,మేజర్‌న్యూస్ :** విశ్వం ఇంజినీరింగ్ కళాశాల,కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్‌ఈ) విభాగానికి చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఎం.గోపీ,కె.షబ్బీర్ అహమ్మద్,కె.రెడ్డి హిమజ, ఎం.అపర్ణ,కె.నవీన్ కుమార్ రూపొందించిన "సేఫ్ స్టెప్ – ఏ స్మార్ట్ మోబిలిటీ సొల్యూషన్ ఫర్ ది విసువల్లి ఇంపారెడ్" అనే ఆవిష్కరణకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఏపిఎస్.సీ.హెచ్.ఈ) నుండి రాష్ట్రస్థాయి అవార్డు లభించింది.ఈ అవార్డును ఏపిఎస్.సీ.హెచ్.ఈ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.రామ్మోహన్ రావు స్వయంగా అందజేశారు.ఈ కార్యక్రమం నాగార్జున విశ్వవిద్యాలయం,గుంటూరులో ఘనంగా నిర్వహించబడిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రమణా రెడ్డి తెలిపారు.దృష్టి వికలత ఉన్నవారిని దృష్టిలో ఉంచుకుని రూపొందించబడిన ఈ స్మార్ట్ మొబిలిటీ సొల్యూషన్ వారికి రోజువారీ జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడంలో సహాయపడుతుంది.ఈ పరికరం ఆధునిక సెన్సార్లు,ప్రాసెసింగ్ యూనిట్లు,వైబ్రేషన్ అలర్ట్‌లు, ఆడియో మార్గనిర్దేశక వ్యవస్థ వంటి ఫీచర్లను కలిగి ఉండటం విశేషం.ఇది దృష్టి లోపం ఉన్నవారు సురక్షితంగా సంచరించేందుకు మార్గదర్శకంగా నిలుస్తుందని సి.ఎస్.సి,హెచ్‌ఓడి డాక్టర్ వసంత సెల్వ కుమార్ తెలి పారు.ఈ ఆవిష్కరణ ద్వారా విద్యార్థులు తమ సాంకేతిక ప్రతిభను చూపినట్లే కాక,సామాజిక బాధ్యతను కూడా చాటారు. విద్యార్థుల ఆలోచనాత్మకత, క్రియా శీలత, సామాజిక సమస్యలపై శ్రద్ధ మరియు నూతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో అవలంబించిన దృక్పథం ఈ అవార్డుకు నాంది పలికాయని కళాశాల చైర్మన్ ఎం.ప్రభాకర్ రెడ్డి తెలిపారు.విద్యార్థుల ప్రతిభను గుర్తించి అవార్డుతో గౌరవించిన ఏపిఎస్.సీ.హెచ్.ఈ మరియు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నాగార్జున విశ్వవిద్యాలయానికివిశ్వంఇంజినీరింగ్ కళాశాల ధన్యవాదాలు తెలుపుతోందనిఈరకమైనప్రోత్సాహంవిద్యార్థుల్లో అభివృద్ధి దిశగా నూతన ఆవిష్కరణలకు మార్గదర్శిగా నిలుస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ డా.డి.రమణా రెడ్డి తెలిపారు.




# విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

– జిల్లా దివ్యాంగుల విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.వి.కృష్ణ కిశోర్ – మిట్స్ కళాశాలలో అవగాహన సదస్సు






**కురబలకోట,మేజర్ న్యూస్ :** మండలంలోని అంగళ్లు వద్దు గల ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (మిట్స్ కళాశాల) నందు మాదకద్ర వ్యాల దుర్వినియోగంపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కృష్ణ కిశోర్ ఆర్.వి,అసిస్టెంట్ డైరెక్టర్,దివ్యంగుల విభాగము అన్నమయ్య జిల్లా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల నిర్లక్ష్యమో,దుర్మార్గుల స్వార్థమో, కారణ మేదైతేనేంయువతను మత్తుమేఘాలు కమ్మేనుకుంటున్నా యని, చాటుమాటు అంగళ్లు దాటుకొని పాఠశాలలు,కళాశాలల ప్రాంగణాలకు మాదక ద్రవ్యాలు విస్తరిస్తున్నాయన్నారు.దీంతో ఎక్కడి నుంచి ఏ మాదకద్రవ్యం తమ పిల్లలపై విరుచుకు పడుతుందోనని తల్లిదండ్రుల గుండెలు బిక్కు బిక్కుమంటున్నాయని,తెలిసో తెలియకో ఒకసారి మాదకద్రవ్యాల రుచి మరిగితే అవి వ్యసనంలా మెదళ్లకు అంటుకుపోతే,పిల్లల భవిష్యత్ అంధకారంలో పడిపోతుందని ఆవేదనతో వెల్లడించారు.మానసిక వికాసమే కాదు శారీరక ఆరోగ్యము కుంటుపడుతుందని,ఆలోచనా రీతులు,ఉచితానుచిత విచక్షణ, ప్రవర్తనా తీరుతెన్నులను సమూలంగా మార్చేసే మాదకద్రవ్యాలు పిల్లలనే కాదు మొత్తం సమాజాన్ని అతలాకుతలం చేస్తాయన్నారు. ఇప్పటికైనా మేల్కొకపోతే మన బంగారు భవిష్యత్తులు మన కళ్ళముందే గమ్మత్తుగా మత్తులో చిత్తవడం ఖాయమని,విద్యార్థులు దీనిని గ్రహించాలని ఆయన అన్నారు.ఒకసారి మత్తుకు అలవాటు పడితే అది మరణంతో సమాన మని,విద్యార్థులకు ఎంతో అందమైన జీవితం ఉందని దాన్ని ఆస్వాదించేందుకు తప్పటడుగు వేయొద్దని ఆయన సూచించారు. మాదకద్రవ్యాల అరికట్టడం అందరి చేతిలో ఉందని,ఒక స్ఫూర్తిగా దీనిని ముందుకు తీసుకువెళ్లాలన్నారు.ఒక్కసారి అలవాటు పడితే మత్తు ముంచేస్తుందని,దీని బారిన పడి ఎంతోమంది తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు.తల్లిదండ్రులు పట్టించుకోకపోడం, ఉద్యోగ సమస్య వంటివి యువత మత్తుకు అల వాటు పడేందుకు ప్రధాన కారణాలుగా చెప్పవచ్చునని,చిన్న వయసు లోనే పిల్లలు మత్తుకు అలవాటు పడుతున్నారని ఆయన అన్నారు. సరదాగా సిగరెట్లు,మద్యంతో మొదలవుతూ డ్రగ్స్ తీసు కోవడం వరకు ఇది దారితీస్తోందని,డ్రగ్స్ మనకు మనం మన జీవితాల్లోకి ఆహ్వానించుకునే మహమ్మార న్నారు.కళాశాలలు,విద్యాసంస్థల్లో డ్రగ్స్ నిరోధక కమిటీలను ఏర్పాటు చేసినట్లు,విద్యార్థుల్లో చైతన్యం తెచ్చి మాదక ద్రవ్యాలనుఅరికట్టడానికి యువత సకరించాలన్నారు.కేంద్ర సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వ శాఖ పరధిలో (డివిజన్) సామాజిక భద్రత క్రింద మాదకద్రవ్యాల దుర్వినియోగం నివారణ (డ్రగ్ అబ్యూస్ ప్రివెన్షన్)అనేభావనఉంది.దానిక్రింద ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి నేషనల్ యాక్షన్ ప్లాన్ ఫర్ డ్రగ్ డిమాండ్ అను ఒక కార్యచరణ ప్రణాళికఉంటుంది.అందులోబాగా ప్రతి జిల్లాకు ఒక జిల్లా డి–అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేశారని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్‌కమల్‌బాషా,ఎన్.ఎస్.ఎస్‌కో–ఆర్డినేటర్ రాజేష్ పాల్గొన్నారు.

# అఖిలపక్షం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

**రైల్వే కోడూరు రూరల్ మేజర్‌న్యూస్ :** రైల్వే కోడూరు పట్టణంలో అఖిలపక్షం ఆధర్యంలో శుక్రవారం సాయంత్రం కాశ్మీర్లో జరిగిన పహల్గా లో జరిగిన నర మేధం ను నిర్వహిస్తూ అఖిల పక్షం శాంతియుత ర్యాలీని నిర్వహించారు. మొదట టోల్గేట్‌లోని గాంధీ బొమ్మ వద్దనుండి బస్టాండ్ వరకు శాంతియుతంగా ర్యాలీ నిర్వహించి మృతి చెందిన వారికి అమర్ రహే అంటూ భారీ నినాదాలను చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర మేధం పట్ల అందరూ తీవ్రంగా ఖండించాలని ఇటువంటి సంఘటన జరగకుండా అన్ని దేశాలు అడ్డుకోవాలని అన్నారు.అత్యంత అద్భుతమైన విహారయాత్రను రక్తపాతం చేసిన ఉగ్రవాదులను పాతాళ లోకానికిఅణిచివేయాలనివారు పిలుపు నిచ్చారు.ఈకార్యక్రమంలో బిజెపి బజరంగ్దళ్ ఆర్ఎస్ఎస్ తోపాటు పలు రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

# పక్క గృహాలకు అర్హులైన వారు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోండి



**రామాపురం మేజర్ న్యూస్:** పక్క గృహాల కోసం అర్హులైన వారు గ్రామ సచివాలయంలో ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ పీడి సాంబశివయ్య పేర్కొన్నారు మండలంలోని నల్లగుట్టపల్లి బీసీ కాలనీ కుమ్మరపల్లి గ్రామాలలో శుక్రవారం ఆయన నిర్మాణ దశలో ఉన్న పక్కా గృహాలను పరిశీలించారు ఈ సందర్భంగా కుమ్మర పల్లె గ్రామంలో పూరిల్లు నివాసమున్న వారు కనిపించడంతో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో అర్హులైన వారు సచివాలయంలో ఆన్లైన్లోపక్కగృహాలకుదరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు గతంలో మంజూరైన గృహాల్లో నిర్మించుకోలేక పోయినా ఎస్టీ లబ్ధిదారులకు 70000 ఎస్సి బిసి లబ్ధిదారులకు 50000 చొప్పున అదనంగా ప్రభుత్వం అందజేస్తుందని త్వరగా ఇల్లు పూర్తి చేసుకోవాలన్నారు ఆయన వెంట మండల హౌసింగ్ ఏఈ ఎల్వి ప్రసాద్ సచివాలయలఅసిస్టెంట్ఇంజనీర్లు పాల్గొన్నారు

# ఉగ్రవాదాన్ని అణచివేయాలి

**రామపురం మేజర్‌న్యూస్:** జమ్మూకాశ్మీర్ సమీపంలోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాద దాడి అత్యంత హేయమైన చర్య అని ఉగ్రవాదాన్ని అణిచివేయాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలోశుక్రవారం ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పహల్మలో పర్యా టకులపై ఉగ్రవాదుల దాడులపైనిరసనర్యాలీనిర్వహించారు. 28 మంది పర్యాటకులను ఉగ్రవాదులు దారుణంగా కాల్చి చంపడం అమానవీయ చర్య అని తెలిపారు.ఈ సంఘటనపై దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. దేశ సమగ్రతను విచ్ఛిన్నంచేయడానికికొంతమంది విచ్ఛిన్నకారులు, ఉగ్రవాదులు ప్రయత్నం చేస్తున్నారని, దేశమంతా ఒక్కటై ఉక్కు పిడికిలితో ఉగ్రవాదాన్నికూకటివేళ్ళతో పెకిలించాల న్నారు. ఈ పాశవిక చర్యను ప్రతిఒక్కరూ ఖండిచాలని తెలిపారు. మృతుల కుటుంబాల కు సంతాపంతెలిపివారిఆత్మశాంతికో సంప్రార్థించారు.విశ్వహిందూ పరిషత్ వీరారెడ్డి ప్రసాద్‌రెడ్డిదామోదర్‌నా యుడు భాస్కర్‌రెడ్డిశ్రీనివాసులుశ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు



# మున్సిపల్ కార్మికులు సీతమ్మ, విజయలక్ష్మి కొండయ్య పదవి విరమణ

**రాజంపేట, మేజర్‌న్యూస్:** రాజంపేట మునిసపాలిటీసానిటరీసెక్షన్‌లో పనిచేయుచున్నమున్సిపల్‌కార్మికులుసీతమ్మ విజయలక్ష్మి కొండయ్య అను వారందరికీ పదవి విరమణ సందర్భముగా సచివాలయం సిబ్బంది సెక్రటరీస్ వారి ప్రోత్సాహముతో శుక్రవారం మున్సిపల్ ఆఫీసు నందు కమిషనర్ జి శ్రీనివాసులు ఆధ్వర్యంలో కార్మికులను పూల దండలు శాలవాలు స్వీట్ లుతో సత్కరించి వారిని గౌరవిన్చ తగ్గారు ఈ కార్యక్రమంలో నందుసియుటినాయకులుచిట్వేలి రవికుమార్ పివి రమణ లక్ష్మీదేవి ఎంవి రమణ కే ప్రసాద్ కార్మికులందరూ పెద్ద ఎత్తున వచ్చి ఈ సన్మానాన్ని విజయవంతం చేశారు.



# సాయి డిగ్రీ కళాశాలలో వృత్తి విద్యా కోర్సులు

– ప్రిన్సిపాల్ ముత్యాల పెంచలయ్య

**రైల్వే కోడూరు రూరల్ మేజర్ న్యూస్ :** రైల్వేకోడూరు పట్టణంలో నీ సాయి డిగ్రీ కళాశాలలోబీసీఏబిబిఏబిఎమ్ఎస్ కోర్సులనుప్రారంభించనున్నట్లుకళాశాల ప్రిన్సిపాల్‌ముత్యాలపెంచలయ్యతెలిపారు. నియోజకవర్గంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పెంచలయ్య విలేకరులకుతెలిపారు.ఇందులో విద్యార్థులు ద్వారా వృత్తి విద్యా కోర్సులు ద్వారా వారి భవిష్యత్తుకుబంగారుభవిష్యత్తుకు పునాదులు వేసుకోవచ్చని ఆయన తెలియజేశారు.



# పహల్గాం ఉగ్రదాడిపై అన్నమాచార్య యూనివర్సిటీలో కొవ్వొత్తుల ర్యాలీ




– ఉగ్రవాదాన్ని ఖండిస్తూ శాంతి సందేశం




**రాజంపేట, మేజర్‌న్యూస్ :** జమ్మూ, కాశ్మీర్ రాష్ట్రంలోని పహల్గాం ప్రాంతంలో ఇటీవల ఉగ్రవాదులు జరిపిన దారుణమైన దాడిలో అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై అన్నమాచార్య యూనివర్సిటీ, రాజంపేట తరపున తీవ్ర సంతాపం ప్రకటిస్తూ శుక్రవారం విశ్వవిద్యాలయ స్థాయిలో మౌన ప్రార్థనతో పాటు కొవ్వొత్తుల ర్యాలీనిర్వహించబడింది. ఈసందర్భంగా



యూనివర్సిటీ ఆడిటోరియం లో అన్ని కళాశాలల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు ఒకటై మౌనంగా రెండు నిమిషాలు ప్రార్థన చేశారు. అనంతరం, విశ్వ విద్యాలయవైస్ చాన్సలర్ డా. ఈ. సాయి బాబా రెడ్డి మార్గ దర్శనంలో విద్యార్థులు, అధ్యాపకులు చేతుల్లో దీపాలను పట్టుకుని ప్రధాన గేట్ వరకు కొవ్వొత్తుల ర్యాలీగా నడిచి, ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండిస్తూ శాంతికి ప్రతీకలయ్యారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్. మల్లికార్జున రావు గారు, అన్నమాచార్య ఇన్స్టిట్యూట్ఆఫ్ టెక్నాలజీ సైన్సెస్ ప్రిన్సిపాల్ డా. ఎస్.ఎం.వి. నారాయణ , యూనివర్సిటీకి చెందిన అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లు, అన్ని విభాగాల శాఖాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఈ. సాయి బాబా రెడ్డి మాట్లాడుతూ “మానవతను తుంచేసే ఈ ఉగ్రవాద చర్యలను విశ్వవిద్యాలయం తరపున ఖండిస్తున్నామని, ఈ ఘటనలో తమ ప్రాణాలు కొల్పోయిన వారికి ఘన నివాళులు అర్పిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు నైతిక బాధ్యతతో మానవతా విలువలను కాపాడేలా తాము ప్రేరేపిస్తున్నామన్నారు. ఈ కొవ్వొత్తుల ర్యాలీ వలన విద్యార్థులలో దేశభక్తిని, సామాజిక బాధ్యతను పెంపొందించడమే కాకుండా, మనసుల్నికలిపేశాంతి సందేశాన్ని సమాజానికి అందించ వచ్చని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ముగింపులో బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, భగవంతుడు వారికి మనోధైర్యం ప్రసాదించాలని అందరూ ప్రార్థించారు.

## ఐకరాజ్యసమితి పాకిస్తాన్ ను ఉగ్రవాద దేశంగా ప్రకటించాలి

– పహల్గాం కాల్పుల ఘటనను ఖండిస్తు నిరసన ర్యాలీ – మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు కంచర్ల శ్రీనివాసులు నాయుడు

**మదనపల్లె టౌన్,మేజర్ న్యూస్ :** ఐకరాజ్య సమితి పాకిస్తాన్ ను ఉగ్రవాద దేశంగా ప్రకటించాలని మదనపల్లి డివిజన్ మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు కంచర్ల శ్రీనివాసులు నాయుడు కోరారు. శుక్రవారం కమ్మవీది శుభం ఫంక్షన్ హల్ నందు జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ రజాక్,చిత్తూరు,కడప ఆఫీస్ క్లర్క్ లు మరియు మదనపల్లి డివిజన్ మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో పహల్గాంలో ఉగ్రవాదుల కాల్పులకు నిరసనగా ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్బంగా కంచర్ల శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ కాశ్మీరలో పర్యాటక ప్రదేశాలను తిలకించడానికి వెళ్లిన పర్యాటకులపైన అమాన



వీయంగా, అమానుషంగా ఉగ్రవాదులు కాల్పులు జరిపి 28 మందిని పొట్టన పెట్టుకోవడం అత్యంత హేయమైన చర్యని తీవ్రంగా ఖండ స్తున్నట్లు పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని పెంచిపో షిస్తున్న పాకిస్తాన్ ను ఉగ్రవాద దేశంగా ప్రకటించాలని ఐక్యరాజ్య సమితిని కోరారు. అలాగే మాజీ సైనికులు,వీర నారిమణులు,డాకుమెంట్స్ సమస్యలు తీర్చడం జరిగిందన్నారు. సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ రజాక్మాట్లాడుతూఅమాయక పౌరులని ఉగ్రమూకలు కాల్చి చంపడం దుర్మార్గమైన చర్యని వారు తన ప్రాణాలను తీయవద్దని వేడుకున్న కనికరించకపోవడం అమానుషమన్నారు. మాజీ సైనికుల సంఘం నాయకులు మాట్లాడుతూ పహల్గామ్ ఘటనను ప్రభుత్వం సీరియస్ గా తీసుకొని పున రావతం కాకుండా అరికట్టాలని కోరారు. కాల్పులు ఘటనల్లోప్రాణాలువదిలిన మృతుల కుటుంబాలకు సంతాపాన్ని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో కంచర్ల చింటూ,పీలేరు ప్రెసిడెంట్ రెడ్డప్ప రెడ్డి, పుంగనూరు వైస్ ప్రెసిడెంట్ లక్ష్మి నారాయణ, సెక్రటరీ రాయుడు,వెంకటస్వామి,ప్రతాప్ రెడ్డి,వెంకట రమణా రెడ్డి,దిలీప్,కమిటీ మెంబర్స్, మాజీ సైనికులు వితంతువులు పాల్గొన్నారు.

## పిటిఐల సమస్యలు పరిష్కరించాలని వినతి



**సిద్దవటం మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ల ల్లో పనిచేస్తున్న డ్రాయింగ్, క్రాఫ్ట్, పీఈటి, సంగీతం, మరికొన్ని విభాగాల పార్ట్ టైం టీచర్ల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఎస్ టి యు ప్రధాన కార్యదర్శి, మల్లు రఘునాథరెడ్డి మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డిని కోరారు. గుత్తి ప్రాంతంలో శుక్రవారం జరిగిన ఎస్ టి యు జిల్లాస్థాయి కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర పిటి ఐ సంఘం రి.నెం. 138/217 రాష్ట్ర అధ్యక్షుడు షేక్ హాజీ మలంగ్ మరి కొందరు నాయకులు వారిని కలిశారు. ఈ సందర్భంగా పిటిఐల సమస్యలు నాయకులకు వివరించారు. పి.టి ఐలకు కనీస వేతనం మంజూరు చేయాలని 62 ఏళ్లకు ఉద్యోగ విరమణ వయసు పెంచాలని, పార్ట్ టైం పదము తొలగించి ఒకేషనల్ టీచరుగా పేరు మార్చాలని వారి దృష్టికి తీసుకెళ్లారు. వారు సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేసి న్యాయం చేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా సభ్యులు మహేశ్వరి, ప్రసాద్, గురు స్వామి పాల్గొన్నారు.

## బలహీన వర్గాల పిల్లలకు చదువు ఉచితం

– మండల విద్యాశాఖ అధికారి వెంకటరమణ



**ములకలచెరువు, మేజర్‌న్యూస్ :** ములకలచెరువు మండలంలోని 9 ప్రైవేట్ పాఠశాలలో 1 తరగతి లో 25% సీట్లు ఆర్ టి ఈ 12 (1) ప్రకారం బలహీన వర్గాల పిల్లలకు ఉచితంగా చదువుకే అవకాశం మన ప్రభుత్వం అందిస్తుందని కాబట్టి అర్హత గల పిల్లల తల్లిదండ్రులు వారి నివాసానికి దగ్గర గల ప్రైవేట్ స్కూల్ /సచివాలయం / ఇంటర్నెట్ సెంటర్ /, మీ సేవా సెంటర్ / మండల విద్యా శాఖ అధికారి వారి కార్యాలయంలో కానీ సంప్రదించి.. 28.04.2025 నుండి 15.5.2025 తేదీ వరకూ.. తల్లిదండ్రుల, పిల్లల ఆధార్ కార్డు, పిల్లల వయస్సు ధ్రువీకారణ పత్రాలు తీసుకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలనిమండల విద్యా శాఖధికారి ఎన్ వెంకటరమణ తెలిపారు.

## జడ్జికు బార్ కౌన్సిల్ సభ్యులు సన్మానం

**నందలూరు మేజర్‌న్యూస్:** నందలూరు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టునందు నందలూరు బార్ అసోసియేషన్అధ్యక్షులుదాసరి నరసింహులుఅధ్యక్షతనఇన్చార్జ్జడ్జిగా ఉన్నటువంటి జూనియర్ సివిల్ జడ్జ నందిని ధర్మవరంకి బదిలీ అయిన సందర్భంగా మరియు ప్రస్తుత ఇన్చార్జ్ జూనియర్ సివిల్ జడ్జి గారైన భార్గవి ఇరువురికి బార్ ఆసోసియేషన్ సభ్యులు సన్మాన కార్యక్ర మం నిర్వహించడంజరిగినది. ఈ కార్యక్రమంలో బార్ అసోసి యేషన్ జనరల్ సెక్రటరీ గొబ్బిళ్ళ సుబ్బ రామయ్య , జాయింట్ సెక్రెటరీ నాయన పల్లి అనుదీప్ జయసింహ, ఎగ్జిక్యూటివ్ మెంబర్ హస్తవరం ఆనంద్ కుమార్ , లేడీ రిప్రజెంటేటివ్ మాడపురి నళిని , సయ్యద్ మహమ్మద్ అలీ, కొప్పాల సుబ్రహ్మణ్యం, పసుపులేటి శ్రీకర్ , పనతల రాబిన్సన్ పాల్గొన్నారు.



**విలేఖరులు కావలెను**

18 సంవత్సరాలుగా వార్తా ప్రపంచంలో నికార్సైన వార్తలకు వేదికగా నిలిచిన నేటి దినపత్రిక సూర్య పత్రికలో అన్నమయ్య జిల్లాలో ఈ క్రింది మండలాలకు విలేకరులు కావలెను.

నిమ్మనపల్లి, పెద్దమండ్యాం, పీటీఎం, ములకలచెరువు, గుర్రంకొండ, కలకడ, వాయల్పాడు, వీరబల్లి, ఓబులవారిపల్లి, రైల్వే కోడూరు క్రైమ్, రాజంపేట క్రైమ్, మరియు రాయచోటి నియోజకవర్గం లో అన్ని మండలాలకు ఆసక్తి ఉన్న విలేకరులు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్

8897594213, 9515583664

# అఖిలపక్షం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



**రైల్వే కోడూరు రూరల్ మేజర్‌న్యూస్ :** రైల్వే కోడూరు పట్టణంలో అఖిలపక్షం ఆధర్యంలో శుక్రవారం సాయంత్రం కాశ్మీర్లో జరిగిన పహల్గా లో జరిగిన నర మేధం ను నిర్వహిస్తూ అఖిల పక్షం శాంతియుత ర్యాలీని నిర్వహించారు. మొదట టోల్గేట్‌లోని గాంధీ బొమ్మ వద్దనుండి బస్టాండ్ వరకు శాంతియుతంగా ర్యాలీ నిర్వహించి మృతి చెందిన వారికి అమర్ రహే అంటూ భారీ నినాదాలను చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర మేధం పట్ల అందరూ తీవ్రంగా ఖండించాలని ఇటువంటి సంఘటన జరగకుండా అన్ని దేశాలు అడ్డుకోవాలని అన్నారు.అత్యంత అద్భుతమైన విహారయాత్ర ను రక్తపాతం చేసిన ఉగ్రవాదులను పాతాళ లోకానికిఅణిచివేయాలనివారు పిలుపు నిచ్చారు.ఈకార్యక్రమంలో బిజెపి బజరంగ్దళ్ ఆర్ఎస్ఎస్ తోపాటు పలు రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

# విశిష్ట వేరుశనగ రకంతోనే అధిక దిగుబడులు

## కెవికె కోఆర్డినేటర్ డాక్టర్ మంజుల



**కలికిరి మేజర్‌న్యూస్:** విశిష్ట వేరుశనగ రకం తోనే రైతులకు అధిక దిగుబడులు లభిస్తాయని కెవికె కోఆర్డినేటర్ డాక్టర్ మంజుల తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం, కలికిరి సహకారంతో నూతన వేరుశెనగ రకం విశిష్ట నుండి సంతృప్తికర దిగుబడిని రైతులు సాధించినట్లు ఆమె తెలిపారు. మీ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో వేరుశెనగ మరియు వరి ప్రధానమైన పంటలని, సాధారణంగా రైతులు నారాయణి మరియు కె%-%6 అనే వేరుశెనగ రకాలు ఎక్కువగా సాగు చేస్తున్నారని, తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం వారు 2022 లో విడుదల చేసిన విశిష్ట (టి సి జి ఎస్ 1694)రకాన్ని, కృషి విజ్ఞాన కేంద్రం, కలికిరి వారు ప్రస్తుత రబీ కాలంలో రైతుల పొలాల్లో సామూహిక ప్రదర్శనా క్షేత్రాలు వాయల్పాడు, పీలేరు , కలికిరి మరియు కె వి పల్లి మండలాల్లో నిర్వహించడం జరిగిందని తెలిపారు. అందులో భాగంగా ఈ వశిష్ట రకం టిక్కా ఆకు మచ్చ మరియు తుప్పు తెగుళ్లను తట్టుకుంటుందని, ఈ రకం నీటిని సమర్ధవంతంగా వినియోగించు కుంటుందని మరియు పంట కాలం రబీలో 105 -110 రోజులు పడుతుందని, ఒక ఎకరాకు రబీలో సమగ్ర యాజమాన్యం పద్ధతులు పాటిస్తే 35 నుండి 40 బస్తాలు దిగుబడినిస్తుందని మరియు నూనె శాతం 50 % వుండునని తెలిపారు. గండబోయన పల్లి గ్రామం, వాయల్పాడు మండలం లోని పి సత్య నారాయణ రెడ్డి (9885379159) అను రైతు -నారాయణి, కదిరి లేపాక్షి మరియు విశిష్ట అనే వేరుశెనగ రకాలను ఒకే పొలం దగ్గర 2 ఎకరాలు డ్రిప్ ద్వారా సాగు చేసారని విశిష్ట వేరుశెనగ రకం ఒక చెట్టుకి 52 నుండి 58 కాయలు రావడంతో ఎకరాకు 37బస్తాలు దాకా దిగుబడివచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయ కర్త డా కె.మంజుల రైతు పొలాన్ని క్షేత్ర సందర్శన చేసి రైతుని అభినందించి, ఈ విశిష్ట వేరుశెనగ రకం మన జిల్లాలోని వివిధ గ్రామాల రైతులకు విత్తనం కొరకు వ్యాప్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సోమ శేఖర్ బాబు, పీరూ సాహెబ్ రైతులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి పెద్దిరెడ్డితోపాటు శుభకార్యాల్లో పాల్గొన్న నిస్సార్ అహమ్మద్





**మదనపల్లె రూరల్,మేజర్ న్యూస్ :** మదనపల్లెలో సీనియర్ నాయకులు నంద కుమార్ కుమార్తె మానస వివాహ వేడుకలు, సిటిఎంలో ప్రకాష్ కుమార్తె రోజా నిశ్చితార్థ వేడుకలలో మాజీ మంత్రి,పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,మదనపల్లె వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్,మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.ఇందులో భాగం గా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి స్థానిక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కార్యకర్తలు, నాయకులను పేరు,పేరునా ఆప్యాయంగా పలకరించారు.ఈ కార్యక్రమాలలో అక్కులప్ప, వెలుగు చంద్ర,ఆనంద పార్థసారధి,వైసీపి రాష్ట్ర మహిళా కార్యదర్శి రేవతి,యూనస్ పెద్ద సంఖ్యలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.